ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 29.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 279 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

నాలుగో టీ20లోనూ మనదే గెలుపు 8

...:: 7లో

జలాంతర్గామిలో ప్రయాణించిన రాష్ట్రపతి

త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము జలాంతర్గామిలో ప్రయాణించారు. కర్ణాటకలోని కార్వార్ నౌకాదళ స్థావరం నుంచి కల్వరి శ్రేణి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ లో బయలుదేరారు.

ఆపరేషన్ సిందూర్ గొప్ప విజయం



- ప్రపంచ దేశాలకు మన సత్తా చాటాం
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి సాధించాం
- యువశక్తే భారతదేశానికి ప్రధాన బలం
- ఈ ఏడాది చివరి మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్28: ఆపరేషన్ సిందూర్ 2025లో భారత్ సాధించిన గొప్ప విజయమని, దీంతో ప్రపంచ దేశాలకు మన సత్తా చాటామని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. మారుతున్న భారతావనిగా దీనిని ప్రధాని అభివర్ణించారు. సైనిక విజయాన్ని దేశవ్యాప్తంగా దేశభక్తిని పెంచిన ఘటనగా ప్రశంసించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన ఈ ఏడాది చివరి మన్ కీ బాత్ కార్యక్రమంలో దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 129వ మన్ కీ బాత్‌లో 2025 సంవత్సరంలో భారతదేశం సాధించిన విజయ క్షణాలను ప్రధాని గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌ను మారుతున్న భారతావనిగా అభివర్ణించి, సైనిక విజయాన్ని దేశవ్యాప్త దేశభక్తిని పెంచిన ఘటనగా ప్రధాని ప్రశంసించారు. ఈ ఏడాది భారత్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చూపిన ధైర్యం, స్వదేశీ ఆయుధాలు, టెక్నాలజీ ఉపయోగం ద్వారా సాధించిన విజయాలను మోదీ ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశం ఉగ్రవాదాన్ని రూపుమాపే నిర్ణయాన్ని

...:: మిగతా 2లో



త్వరలోనే 'మలేరియా'ను తరిమేస్తాం

భారత్ నుంచి మలేరియాను త్వరలోనే పూర్తిగా తొలగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. అహ్మదాబాద్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్వహించిన ఆలిండియా మెడికల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు.

7

కాంగ్రెస్, బీఆర్ఎస్ జలయుద్ధం

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని కేసీఆర్‌నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సమావేశాలకు తాను వస్తానని, అధికార పక్షం ఎలాంటి ఎజెండాను ఖరారు చేస్తుందో చూసి ముందుకు వెళదామని పార్టీ నేతలతో ఆయన పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీకి వచ్చి, కాంగ్రెస్‌ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని కేసీఆర్ ప్రణాళిక రూపొందించారని తెలుస్తోంది. అటు కాళేశ్వరం దగ్గర నుంచి మొదలుపెడితే ఫోన్ ట్యాపింగ్ వరకు ప్రతి వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావును ఇరుకున పెట్టడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళికలు రూపొందించారు.

- ఎర్రవల్లి నుంచి హైదరాబాద్ కు కేసీఆర్
- సభకు రావాలని నిర్ణయించుకున్న గులాబీ బాస్
- కాంగ్రెస్‌ఎజెండాను బట్టి ముందుకెళ్లాలని బీఆర్ఎస్ నిర్ణయం
- కాళేశ్వరం నుంచి ఫోన్ ట్యాపింగ్ వరకు
- బీఆర్ఎస్ ను ఇరుకున పెట్టేందుకు సీఎం రేవంత్‌ప్లాన్
- నదీ జలాలపై అధికారులతో సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్28: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. నదీ జలాల పంపిణీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లపై ఈ సమావేశాలలో చర్చ జరిగే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభానికి ముందే రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరయ్యేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. గులాబీ బాస్‌అసెంబ్లీకి వస్తారా.? లేదా? అనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ మేరకు బీఆర్ఎస్‌అధినేత, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌ఆదివారం సాయంత్రం ఎర్రవల్లిలోని ఫాంహౌస్ నుంచి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన నివాసానికి మాజీ సీఎం చేరుకున్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని కేసీఆర్‌నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సమావేశాలకు తాను వస్తానని, అధికార పక్షం ఎలాంటి ఎజెండాను ఖరారు చేస్తుందో చూసి ముందుకు వెళదామని పార్టీ నేతలతో ఆయన పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీకి వచ్చి, కాంగ్రెస్‌ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని కేసీఆర్ ప్రణాళిక

...:: మిగతా 2లో

కనీసం 15 రోజులు అసెంబ్లీ నడపాలి: హరీశ్ రావు

...:: 3లో

సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ వైఫల్యం స్పష్టం

పాలమూరు-రంగారెడ్డి కూడా పూర్తి చేయలేదు

- గోదావరి, కృష్ణ నదులపై అనేక ప్రాజెక్టులు ఉన్నా..
- సాగునీరు పూర్తిస్థాయిలో అందకపోవడం ప్రభుత్వ వైఫల్యమే
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- నాగర్‌కర్నూల్ జిల్లా రెండో రోజు పర్యటన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్/ నాగర్‌కర్నూల్, డిసెంబర్ 28: నిర్వాసిత రైతులు, సాగునీటి ప్రాజెక్టుల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఎండగట్టారు. ప్రజల ఆరోగ్యం, రైతుల భూములు, సాగునీటి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని వ్యాఖ్యానిస్తూ, తప్పులు చేసిన వారెవరిదైనా ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా రెండో రోజు పర్యటన ప్రారంభానికి ముందు మైసిగండి అమ్మవారిని దర్శించుకుని కవిత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గంలోని అమన్‌గల్ పట్టణంలో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. జనావాసాల మధ్య చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆరేళ్లుగా ప్రజలు నిరసనలు, దరఖాస్తులు ఇస్తున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్లాస్టిక్ చెత్తను

...:: మిగతా 2లో

జమ్మూలో 30 మంది ఉగ్రవాదులు

జమ్మూ ఏరియాలో 30 మందికి పైగా పాకిస్థానీ ఉగ్రవాదులు తలదాచుకున్నట్టు నిఘా వర్గాలు వెల్లడించాయి. దాంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉగ్ర స్థావరాలు గుర్తించడానికి గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

7



ఆ వేళ నన్ను తలదాచుకోమన్నారు

ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రాణాలు కాపాడుకునేందుకు తనను బంకర్లో దాక్కోవాలని అధికారులు సూచించారని అసిఫ్ అలీ జర్దారీ వెల్లడించారు.

7

రాష్ట్రానికి కేంద్రం షాక్.. 'ఉపాధి' పని వేళలు పెంపు

- నిధుల్లో భారీ కోత.. రాష్ట్రానికి 1500 కోట్ల భారం

...:: 3లో

డెస్క్ జర్నలిస్టులందరికీ న్యాయం చేస్తాం

- బస్ పాస్లతో సహా అన్ని వర్తింపజేయిస్తాం
- అవాస్తవాలను నమ్మొద్దు
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

...:: 3లో

పాలమూరును మళ్లీ వలసల జిల్లాగా మార్చిన రేవంత్

- పాలమూరు నీళ్ల కోసం కేసీఆర్ పోరాటానికి సిద్ధం
- రైతు బంధు పోయి 'రాబంధు' పాలన
- యూరియా క్యూలైన్లే ఎందుకు నిదర్శనం
- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పండబెట్టింది కాంగ్రెస్సే
- కాంగ్రెస్–బీజేపీ చీకటి స్నేహం బయటపడింది
- బంగారంలాంటి తెలంగాణను దోచుకుంటున్న రేవంత్ ప్రభుత్వం
- నాగర్ కర్నూల్ సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్/నాగర్ కర్నూల్, డిసెంబర్ 28: పాలమూరు జిల్లాను మళ్లీ వలసల జిల్లాగా మార్చిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నాగర్ కర్నూల్‌లో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన నూతన సర్పంచుల ఆత్మీయ సమావేశ సభలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "కేటీఆర్ పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయింది. తట్టెడు మట్టి కూడ తీయకుండా నికృష్టపు మాటలు మాట్లాడుతున్నాడు. కాంగ్రెసోళ్లు పాలమూరును మళ్లీ వలసల జిల్లాగా మార్చారు. ప్రాజెక్టులను పండబెట్టి పాలమూరు జిల్లాను ఎండబెట్టారు" అని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో పాలమూరు ప్రాజెక్టు 90 శాతం పూర్తి చేశామని గుర్తుచేశారు. పిలిచిన టెండర్లను రద్దు చేసి ప్రాజెక్టును పండబెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నీటి కేటాయింపుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీ పడుతున్నారని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును కాపాడుకొని రైతన్నలకు అండగా నిలబడేందుకు, తెలంగాణ నీటి వాటాల ప్రయోజనాలను కాపాడేందుకు కేసీఆర్ మరోసారి

...:: మిగతా 2లో



పుణె ఎన్నికల్లో గ్యాంగ్‌స్టర్ పోటీ

సొంత మనవడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఓ గ్యాంగ్‌స్టర్ పుణె లోకల్ బాడీ ఎన్నికలలో పోటీ పడుతున్నాడు. శనివారం అతడు జైలు నుంచి రిటర్నింగ్ కార్యాలయానికి వచ్చి నామినేషన్ దాఖలు చేశాడు.

7

అసెంబ్లీ సమావేశాలు సజావుగా సాగాలి

- రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకరించాలి
- ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్షించిన శాసన సభ స్పీకర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 28: తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం శాసనసభ భవనంలోని కమిటీ హాల్లో సన్నాహక సమావేశం నిర్వహించారు. తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, శాసనమండలి కార్యదర్శి వి. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఢిల్లీ పర్యటనలో ఉండడంతో హాజరైన ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, డీజీపీ శివధర్ రెడ్డి, ఏడీజీపీ విజయకుమార్, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు సజ్జనార్, అవినాష్ మహంతి, సుధీర్ బాబు, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, అసెంబ్లీ చీఫ్ మార్షల్ కర్ణాకర్ పాల్గొన్నారు. సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ నేటి నుంచి శాసనసభ, శాసన మండలి సమావేశాలు ప్రారంభం అవుతున్నాయని, గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ, శాసనసభ అధికారులు, సిబ్బంది అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలని కోరారు. శాసనసభ, శాసన మండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలన్నారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలని, తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలన్నారు. అవసరమైన నోడల్ అధికారులను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలన్నారు. సమావేశాలకు హాజరయ్యే మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని అధికారులు స్పీకర్ గడ్డం ప్రసాద్ రావుకు తెలిపారు.

రాజ్యాంగానికి వ్యతిరేకంగా మోడీ, షా పాలన

- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్28: ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వారిద్దరూ పదవి కాపాడుకోవడానికి ఎంతవరకైనా పోతారని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేష్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీలో రాష్ట్ర వాటా, కేంద్ర వాటా తీసివేయాలని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. బీజేపీ పెత్తందారు పార్టీ అని ఆక్షేపించారు. పేదలను దోచి ఆదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో మనం ఉండటం మన అదృష్టమని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి విజన్ ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి తపన పడుతున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు రేవంత్‌రెడ్డి కులగణన సర్వే చేశారని గుర్తుచేశారు. ప్రధాని మోదీ జనగణన చేస్తామన్నారంటే ఆ ఘనత రేవంత్‌రెడ్డిదేనని చెప్పారు. రానున్న రోజుల్లో బీజేపీ విధానాలను ఎండగడుతూ రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి అందరం కష్టపడి పని చేద్దామని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మళ్లీ బాంబు బెదిరింపులు

- కొచ్చి, జెద్దా ఇండిగో విమానాల్లో బాంబు అమర్చినట్టు మెయిల్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 28: శంషాబాద్ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపాయి. కొచ్చి, జెద్దా నుంచి వస్తున్న ఇండిగో విమానాల్లో ఆర్డీఎక్స్ బాంబు అమర్చినట్టు గుర్తుతెలియని అగంతకుడి నుంచి మెయిల్ వచ్చింది. దీంతో సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. విమానాశ్రయం అంతా ముమ్మర తనిఖీలు చేపట్టారు. మరోవైపు కోల్‌కతా శంషాబాద్ ఇండిగో ఫ్లైట్‌పై లేజర్ లైట్ పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఇండిగో విమానాన్ని లేజర్ లైట్లు తాకాయని అక్కడి అధికారులు వెల్లడించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఇటీవల వరుస బాంబు బెదిరింపు మెయిల్స్, ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో విమానయాన సిబ్బంది అప్రమత్తమై, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఈ తరహా బెదిరింపు కాల్స్, మెయిల్స్‌పై అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాదిలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఇప్పటివరకు 30కి పైగా బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.

మా డాడీ ఎవరో తెలుసా..? అంటే కుదరదు

- న్యూ ఇయర్ వేడుకలకు కట్టుదిట్టమైన భద్రత
- హైదరాబాద్‌సీపీ సజ్జనార్‌కీలక ట్విట్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్28: న్యూ ఇయర్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపడుతున్నారు. న్యూ ఇయర్ వేడుకలు సందర్భంగా నగర వ్యాప్తంగా స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ట్వీట్ చేశారు. మియా, డ్రింక్ చేశావా..? అయితే స్టిరింగ్ కు సలాం చెప్పి క్యాబ్ బుక్ చేసుకో.. లాయర్ ను కాదు' అంటూ సజ్జనార్ ట్వీట్ చేశారు. మద్యం సేవించిన తర్వాత వాహనం నడపకుండా క్యాబ్ ఎంచుకోవాలని సూచనలు చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అలాగే మరో ట్వీట్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడి.. 'మా డాడీ ఎవరో తెలుసా..?', 'మా అంకుల్ ఎవరో తెలుసా..?'..'అన్న ఎవరో తెలుసా..?'... అని తమ అధికారులను అడగొద్దని సీపీ సజ్జనార్ సూచించారు. అలా అంటే చెబితే ఏమీ జరగదని అన్నారు. తాము ప్రజల వ్యక్తిగత గోప్యతను గౌరవిస్తామని.. అలాంటప్పుడు వాహనం పక్కకు పెట్టి, మళ్లీ కోర్టులో డేట్ వచ్చినప్పుడు కలుస్తామని సీపీ సజ్జనార్ వార్నింగ్ ఇచ్చారు. అలాగే మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 120 ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఈగల్ టీమ్ తనిఖీలు

10 రోజుల్లో 27 మంది అరెస్ట్

మరోవైపు నగరంలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ నేపథ్యంలో నగరంలోని అనేక పబ్బులపై ఈగల్ టీమ్ తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో క్వేక్ ఎరీనా పబ్‌లో తనిఖీలు నిర్వహించింది. అనుమానం వచ్చిన యువకులకు టెస్టులు చేసింది. దీంతో 8 మందికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు తేలింది. మొత్తం 14 మందికి పరీక్షలు నిర్వహించగా 8 మందికి పాజిటివ్ అని తేలింది. ఇక డ్రగ్స్ కేసులో 10 రోజుల్లో 27 మందిని ఈగల్ బృందం అరెస్ట్ చేసినట్లు సమాచారం. అరెస్ట్ అయిన వారిలో ఐదుగురు విదేశీయులు సహా 17 మంది డ్రగ్ సప్లైదారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు నిందితుల నుంచి 68 గ్రాముల కొకైన్, 50. 5 గ్రాముల ఎండీఎంఏ.. అలాగే 382 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ జలయుద్ధం

మొదటిపేజీ తరువాయి

రూపొందించారని తెలుస్తోంది. అటు కాళేశ్వరం దగ్గర నుంచి మొదలుపెడితే ఫోన్ ట్యాపింగ్ వరకు ప్రతి వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావును ఇరుకున పెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని సవాల్‌కూడా చేశారు. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ ను గట్టిగా ఫిక్స్ చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. చాలా రోజుల తర్వాత మీడియా ముందుకు వచ్చిన కేసీఆర్ కాంగ్రెస్‌ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అంతేకాదు, ముఖ్యమంత్రి సొంత జిల్లాలో నిర్మించే పాలమూరు, రంగారెడ్డి పథకంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం తోలు తీస్తానని హెచ్చరించారు. అవసరమైతే ఉద్యమం కూడా చేపడతానని స్పష్టం చేశారు. అటు రేవంత్ రెడ్డి కూడా ఈ విమర్శలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ముందు నీకు దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. దీంతో కేసీఆర్ అసెంబ్లీకి రావాలని ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. వాస్తవానికి 2023లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత కేసీఆర్ రెండు పర్యాయాలు మాత్రమే అసెంబ్లీకి వచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు హాట్‌హాట్‌గా ఉండే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

ప్రాజెక్టులపై సీఎం రేవంత్ సమీక్ష

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. 2014 నుంచి 2023 దాకా నీటి ప్రాజెక్టులపై గత ప్రభుత్వం అనుసరించిన విధానం, కేటాయింపులు, వెచ్చించిన నిధులు, జరిగిన నష్టంపై చర్చించారు. భారీ వడ్డీతో తీసుకున్న రుణాలు, ఈ రెండేళ్ల కాలంలో ఆ రుణభారం తీర్చడానికి ఏ మేరకు చెల్లింపులు చేయాల్సి వచ్చిందన్న దానిపైనా సమీక్షించారు. కాంగ్రెస్ హయాంలో రెండేళ్లుగా ప్రాజెక్టులకు చేసిన కేటాయింపులు, పనులపై ఆరా తీశారు. ప్రధానంగా పాలమూరు, రంగారెడ్డితో పాటు కృష్ణా బేసిన్‌లోని వివిధ ప్రాజెక్టుల పనులను ఏ విధంగా చేపట్టారు? రీడిజైనింగ్ వల్ల పనుల్లో జరిగిన జాప్యం, ఏ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎంత కాలం పాటు ఆలస్యమయ్యాయి? తదితర వివరాలపై సీఎం రేవంత్ అధికారులను ఆరా తీశారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల నేపథ్యంలో సీఎం ఈ సమీక్ష నిర్వహించారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్28: 141వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు దేశ్యవాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఘనంగా జరుపుకున్నారు. అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు సైతం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం గాంధీ భవన్లో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తో పాటు సీనియర్‌నేతలు ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పార్టీ శ్రేణులు ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆపరేషన్ సిందూర్ గొప్ప విజయం

మొదటిపేజీ తరువాయి

చాటిందని, ఇది కేవలం సైనిక చర్య కాదు.. మారుతున్న భారత్ బలాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. అంతేకాకుండా, గిర్ అడవుల్లో ఆసియాటిక్ సింహాల సంఖ్య పెరుగుదల, మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, మహిళా సాధికారత వంటి అంశాలను కూడా ప్రధాని ప్రస్తావించారు. వోకల్ ఫర్ లోకల్‌ను మరింత బలోపేతం చేయాలని, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధాని పిలుపునిచ్చారు. మహా కుంభమేళాకు కోట్లాది మంది భక్తులు తరలిరావడం భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. అదే విధంగా, అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలు, ముఖ్యంగా శుభాంశు శుక్లా వంటి యువ ప్రతిభావంతుల కృషి దేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా పెంచిందని ప్రశంసించారు. యువశక్తే భారతదేశానికి ప్రధాన బలం అని ప్రధాని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న సరికొత్త టెక్నాలజీలు, ఆవిష్కరణలను యువత అందిపుచ్చుకుని, దేశ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. విజ్ఞానం, నైపుణ్యం, ఆవిష్కరణలతో భారత్‌ను గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దే బాధ్యత యువతపై ఉందని అన్నారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, సమిష్టి కృషితోనే స్వావలంబన భారత లక్ష్యాన్ని సాధించగలమని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణలోనూ మనం ముందున్నామని ప్రధాని తెలిపారు. "దేశంలో చీతాల సంఖ్య 2025 నాటికి 30కి పైగా పెరగడం సంతోషకరమైన విషయం. ఈ ఏడాది కొన్ని చోట్ల ప్రకృతి వైపరీత్యాలను కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. అయినా మనం ధైర్యంగా నిలబడ్డాం. 2025 మనకు మరింత ఆత్మ విశ్వాసాన్ని ఇచ్చింది. ఇప్పుడు నూతన సంకల్పం, కొత్త లక్ష్యాలతో 2026లోకి అడుగుపెడుతున్నాం" అని ప్రధాని మోదీ అన్నారు. నూతన సంవత్సరం దేశానికి మరిన్ని విజయాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ వైఫల్యం స్పష్టం

మొదటిపేజీ తరువాయి

కాల్చడం వల్ల విషవాయువులు వ్యాపించి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పు ఉందని హెచ్చరించారు. ఫిబ్రవరిలో తమ జాగృతి యాత్ర ముగిసేలోగా సమస్య పరిష్కరించకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని, అవసరమైతే తామే డంపింగ్ యార్డును శుభ్రం చేస్తామని కవిత గారు స్పష్టం చేశారు.

అనంతరం డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎర్రవెల్లి-గోకారం గ్రామాల నిర్వాసితుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. గోదావరి, కృష్ణ నదులపై అనేక ప్రాజెక్టులు ఉన్నప్పటికీ సాగునీరు పూర్తిస్థాయిలో అందకపోవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసినా లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవని, కానీ పాలమూరు-రంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టులు కూడా పూర్తి చేయలేదని అన్నారు. డిండి ప్రాజెక్ట్ కింద గోకారం చెరువు పేరుతో 1500 ఎకరాల భూమి తీసుకుని కేవలం 2000 ఎకరాలకు మాత్రమే నీళ్లు అందించాలనుకోవడం అన్యాయమని వ్యాఖ్యానించారు. అదే బస్వాపూర్ రిజర్వాయర్‌లో భూములు ఇచ్చిన రైతులకు లక్షా 80 వేల ఎకరాలకు సాగునీటి లాభం చేకూరిందని గుర్తు చేశారు. గోకారం చెరువును బలోపేతం చేస్తే అనవసర ముంపు లేకుండా నీటిని వినియోగించుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఎర్రవెల్లి గ్రామ ప్రజలు సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించారని, ఇది ప్రజాస్వామ్య నిరసనకు గొప్ప ఉదాహరణ అని కవిత అన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి పరిస్థితిని పరిశీలించాలని, రెండు మూడు రోజుల్లో స్పందించకపోతే ఇరిగేషన్ మంత్రి, ముఖ్యమంత్రిని కూడా నిలదీయాల్సి వస్తుందని హెచ్చరించారు. డిండి ప్రాజెక్ట్ తప్పనిసరిగా కట్టాల్సిందేనని, కానీ రైతులకు అన్యాయం చేసే ముంపు మాత్రం వద్దని స్పష్టం చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని జంగారెడ్డిగూడెంలో రీజినల్ రింగ్ రోడ్ నిర్వాసిత రైతులతో సమావేశమైన కవిత గారు, ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్‌ను మూడుసార్లు మార్చి పెద్దల భూములు కాపాడుతూ చిన్న రైతుల భూములు లాక్కోవడం సరికాదని అన్నారు. ట్రిపుల్ ఆర్ వల్ల ఎనిమిది జిల్లాల్లోని రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జనవరి 5న హైదరాబాద్‌లో నిర్వాసిత రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, ఆ తర్వాత ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రైతుల సమస్యలను వివరించనున్నట్లు ప్రకటించారు. మొత్తంగా సాగునీటి ప్రాజెక్టులు, నిర్వాసితుల సమస్యలు, ప్రజారోగ్య అంశాల్లో ప్రభుత్వం సమగ్ర దృష్టి పెట్టాలని కవిత గారు డిమాండ్ చేస్తూ, ప్రజల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టమైన సందేశం ఇచ్చారు. అచ్చంపేట నియోజకవర్గంలోని అప్పాపూర్ చెంచు పెంటను సందర్శించారు. ఈ సందర్భంగా చెంచు పెంటలోని చెంచుల నివాసాలకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నల్లమల అడవిలో నివసిస్తున్న చెంచుల జీవన విధానం, విద్య, వైద్యం, రవాణా వంటి మౌలిక సదుపాయాల లోపం, అత్యవసర పరిస్థితుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ముఖ్యంగా వైద్య సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఎదురయ్యే సమస్యలను చెంచులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చెంచు కుటుంబాలకు నూతన వస్త్రాలు అందజేశారు. చెంచుల సమగ్ర అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలమూరును మళ్లీ వలసల జిల్లాగా మార్చిన రేవంత్

మొదటిపేజీ తరువాయి

పోరాటానికి సిద్ధమయ్యారని కేటీఆర్ వెల్లడించారు. త్వరలోనే పాలమూరుకు కేసీఆర్ రాబోతున్నారని, ఆయన చేయబోయే ఈ పోరాటానికి పాలమూరు బిడ్డలంతా అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డికి కమిషన్ల మీద ఉన్న ప్రేమ రైతుల మీద లేదని ఘాటుగా విమర్శించారు. ఇవాళ ఎందుకు పెద్దఎత్తున ప్రజలు కేసీఆర్‌ను కోరుకుంటున్నారో ఆలోచించాలన్నారు. రైతు బంధు పాలన పోయి రేవంత్ రాబంధు పాలన వచ్చిందని ఎద్దేవా చేశారు. రైతులు యూరియా బస్తాల కోసం కాళ్ల మీద పడిగోస పడుతున్నారని, చలిలో చెప్పులు క్యూలైన్‌లో పెట్టి నిలబడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌కు రైతుల పట్ల ప్రేమ లేదని, కేసీఆర్ ఉన్నప్పుడు యూరియా ఎన్ని బస్తాలు కావాలంటే అన్ని ఇచ్చామని గుర్తు చేశారు. దమ్ముంటే యూరియా బస్తాలు దొరికేలా చేస్తా అని శపథం చేయాలని, రూ. 4000 పెన్షన్ ఇస్తా అని శపథం చేయాలని సీఎం రేవంత్‌కు సవాల్ విసిరారు. అలవిగాని, అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు అందరినీ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కంటే అన్ని ఎక్కువిస్తామని ఆశ పెట్టారని, హామీల అమలు ఏమైందని నిలదీస్తే రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. రెండేళ్లు పూర్తైనా ఏమైనా పథకాలని అడిగితే రేవంత్ బూతులు మాట్లాడుతున్నాడని, మహాలక్ష్మి పథకం ఏమైందంటే గుడ్లు పీకి గోటీలాడతానంటున్నాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రెండేళ్లలో రేవంత్ గురించి ప్రజలకు అన్నీ అర్థమయ్యాయని అన్నారు. కేసీఆర్ గ్రామాలను ఎంతో అభివృద్ధి చేశారని, వైకుంఠదామాలు కట్టామని, డంప్ యార్డ్‌లు కట్టామని చెప్పారు. దేశంలోనే ఉత్తమ పంచాయతీ అవార్డులు 30 శాతం మనకే వచ్చేవని గుర్తు చేశారు. ప్రతి గ్రామాన్ని దేశానికే ఆదర్శవంతంగా తీర్చిదిద్దింది కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పడకేసిందని, రేవంత్ పాలనలో ట్రాక్టర్లలో డీజిల్ లేదని, వీధిలైట్లు లేవని విమర్శించారు. తనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే చేస్తున్న అడ్డగోలు వ్యాఖ్యలు, బూతులపైన కేటీఆర్ మరోసారి ఘాటుగా స్పందించారు. "నేను ఆంధ్రాలో చదివితే నీకు నొప్పితే.. నీ అల్లుడిది భీమవరం కాదా?" అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి భీమవరం బుల్లెబ్బాయ్ పేరు సరిపోతుందని ఎద్దేవా చేశారు. "మా నాయన 1984లోనే ఎమ్మెల్యే అయినా జీవితంలో దారి తప్పకుండా, చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమశిక్షణతో పెంచినందులే ఎంఎస్ బయోటెక్నాలజీ, ఎంబీఏ డిగ్రీలు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. తన పని తాను చేసుకున్న అంశాన్ని రేవంత్ రెడ్డి ప్రస్తావిస్తూ అవహేళనగా మాట్లాడుతున్న తీరుకు స్పందనగా మన ఇంట్లో మనం పనిచేసుకుంటే తప్పా?" అని ప్రశ్నించారు.

కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం

సర్పంచ్ ఎన్నికల్లో వంగబెట్టి గుద్దితే రేవంత్‌కు సోయొచ్చిందని విమర్శించారు. ప్రతి ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే వాళ్లకు బుద్ధి వస్తుందని, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికలు సెమీ ఫైనల్ కాగా, అసెంబ్లీ ఎన్నికలు ఫైనల్ అని తెలిపారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడమే మన లక్ష్యమని, అభ్యర్థి ఎవరైనా కారు గుర్తు మీద మాత్రమే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా గెలిచిన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. భారీ ఎత్తున బీఆర్ఎస్ సర్పంచులు గెలవడం శుభదాయకమని అన్నారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటుందో అక్కడ ప్రోగ్రెస్ ఉండదని వ్యాఖ్యానించారు. గెలిచిన సర్పంచులు, వార్డు మెంబర్లు భయపడొద్దని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు మిమ్మల్ని ఏం చేయలేరని ధైర్యం చెప్పారు. దేశంలో మీకు రక్షణగా ఉండేది అంబేద్కర్ రాసిన రాజ్యాంగమని, కాంగ్రెస్ ఎమ్మెల్యేల బెదిరింపులు మిమ్మల్ని ఏం చేయలేవని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎట్లనో, గ్రామానికి సర్పంచ్ అట్లనేనని అన్నారు. ఫైనాన్స్ కమిషన్ నిధులు సీదా గ్రామ పంచాయతీలకు వస్తాయని, ఐదు అంచెల ప్రభుత్వంలో అందరూ కలిసి మెలిసి పనిచేయాలని సూచించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ విధులు అందరూ తెలుసుకోవాలని అన్నారు.

కాంగ్రెస్ ఉంటదో అక్కడ ప్రోగ్రెస్ ఉండదు

ఎక్కడ కాంగ్రెస్ ఉంటదో అక్కడ ప్రోగ్రెస్ ఉండదని కేటీఆర్ పునరుద్ఘాటించారు. ఇంకా రెండేళ్లే కాంగ్రెస్ ఉందని, ఆ తరువాత బీఆర్ఎస్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే పల్లెలు మళ్లీ పచ్చబడుతాయని, లక్ష్మీ కళ వస్తుందని అన్నారు. బంగారంలాంటి రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి నాశనం చేస్తున్నాడని ఆరోపించారు. 10 సంవత్సరాల బి.ఆర్.ఎస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన అద్భుతమైన కార్యక్రమాలు పరిపాలన వలన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎకరం రూ. 150 కోట్లకు చేరిందని, ఆ భూములపై రేవంత్ కన్ను పడిందని ఆరోపించారు. హైదరాబాద్‌లో 9,300 ఎకరాలపై రేవంత్ కన్ను పడిందన్నారు. ప్రభుత్వాలు పరిశ్రమలకు భూములు ఇస్తాయని, రాష్ట్రానికి మంచి జరుగుతుందనే ఉద్దేశ్యంతో తక్కువ ధరకు భూములు ఇస్తామని చెప్పారు. పరిశ్రమల కోసం ఇచ్చిన భూముల్లో ఏదైనా కట్టుకోవచ్చంటున్నడు రేవంత్ అని విమర్శించారు. రూపాయికి 30 పైసలు కడితే ఏదైనా కట్టుకోవచ్చా? అని ప్రశ్నించారు. రూ. 5 లక్షల కోట్లు కొల్లగొట్టేందుకు రేవంత్ హిల్ట్ పాలసీ తెచ్చిందని ఆరోపించారు. లగచర్లలో గిరిజనుల భూములు గుంజుకుంటుంటే అడ్డుకున్నది మన పార్టీ అని గుర్తు చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసిపోయాయి

రేవంత్ రెడ్డి ఎంత దోపిడీ చేసినా బీజేపీ మాట్లాడదని, బీజేపీ పార్టీ కాంగ్రెస్‌ని విమర్శించదని, కాంగ్రెస్ పార్టీ నేతలు బీజేపీని విమర్శించరని తీవ్ర ఆరోపణలు చేశారు. దొంగ చీకటి కలిసిపోయి దోపిడీ చేసినట్లు కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణలో కలిసిపోయాయని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అందుకే రెండు సంవత్సరాల కాలంలో బిజెపి పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలు వైఫల్యాన్ని మోసాన్ని ఎప్పుడు ప్రశ్నించడం లేదని కేటీఆర్ అన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా బిజెపిని విమర్శించకుండా కేవలం బీఆర్ఎస్ పార్టీని మాత్రమే విమర్శిస్తున్నారని అన్నారు. ఇద్దరూ కలిసి రాష్ట్రాన్ని దోపిడీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే లు మర్రి జనార్దన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.



అమెరికా, ఇజ్రాయెల్, యూరప్‌తో తాము పూర్తి స్థాయి యుద్ధంలో ఉన్నాం. ఇరాన్ సొంత కాళ్లపై నిలబడటం పశ్చిమ దేశాలకు ఇష్టం లేదు. తమను మోకరిల్లేలా చేయాలని అనుకుంటున్నాయి. ఇది మనపై ఇరాక్ చేసిన యుద్ధం కంటే దారుణమైనది. చాలా క్లిష్టమైనది. అన్నివైపుల నుంచి ముట్టడిస్తున్నారు. జీవనోపాధి, భద్రతాపరంగా సమస్యలు సృష్టిస్తున్నారు.

- ఇరాన్ ప్రెసిడెంట్ మసౌద్ పెజెష్కియాన్

కనీసం 15 రోజులు అసెంబ్లీ నడపాలి

- ఏ అంశంపై చర్చ పెట్టినా మాట్లాడేందుకు సిద్ధం
- కాంగ్రెస్ ఆరోపణలకు సభలోనే సమాధానం చెబుతాం
- కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీని భ్రష్టుపట్టించింది
- ఏడాదికి 45 రోజులని చెప్పిన కాంగ్రెస్..
- రెండేళ్లలో 40 రోజులే సమావేశాలు పెట్టింది
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్28: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించినట్లే శాసనసభను కూడా భ్రష్టుపట్టించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా చిట్ చాట్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో మొదటి టర్మ్‌లో సంవత్సరానికి సగటున 32 రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో కేవలం 24 రోజులు, 2025లో ఇప్పటివరకు 16 రోజులు మాత్రమే సభను నడిపిందన్నారు. రెండు సంవత్సరాల్లో కలిపి కేవలం 40 రోజులు మాత్రమే అసెంబ్లీ సమావేశాలు పెట్టారని విమర్శించారు. ఏడాదికి 45 రోజులు సభ నిర్వహిస్తామని చెప్పిన కాంగ్రెస్, నేడు 20 రోజులకు కూడా పరిమితం చేసిందన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు మరణిస్తే రెండు రోజులు సంతాప తీర్మానాలు, మూడు శ్వేతపత్రాలు, కాళేశ్వరం కమిషన్ నివేదికకు ఒక రోజు, బీసీ రిజర్వేషన్లపై ఒక రోజు మాత్రమే సభ పెట్టారని తెలిపారు. ప్రజా సమస్యలపై చర్చించడానికి కాకుండా ప్రతిపక్షంపై బురద జల్లడానికే సమావేశాలు పెడుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీని సక్రమంగా నడపడానికి ప్రభుత్వం భయపడుతోందన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఇచ్చిన ఒక్క అంశంపైనా చర్చ పెట్టకపోతే అసెంబ్లీని నడిపి ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగబలం, మందబలంతో సభను నడుపుతోందని వ్యాఖ్యానించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల నీటి కేటాయింపులను 90 టీఎంసీల నుంచి 45 టీఎంసీలకు కుదించారని ఆరోపించారు. 45 టీఎంసీలు సరిపోతాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాశారా లేదా అనే విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 45 టీఎంసీలతో నల్గొండ, రంగారెడ్డి, పాలమూరు జిల్లాల్లో ఏ జిల్లాను ఎండబెడతారని ప్రశ్నించారు. ఏడాది క్రితం డీపీఆర్ తిరిగి వచ్చినా ఇప్పటివరకు మళ్లీ ఎందుకు సబ్మిట్ చేయలేదని నిలదీశారు. బీఆర్ఎస్ అసెంబ్లీని కనీసం 15 రోజులు నడపాలని డిమాండ్ చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏ అంశంపై చర్చ పెట్టినా మాట్లాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కానీ ప్రజా సమస్యలపై చర్చకు కూడా సిద్ధంగా ఉండాలని కోరారు. ఘోష్ కమిషన్ నివేదికపై తాను మాట్లాడితే ఏడుగురు మంత్రులు అడ్డుపడ్డారని, అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులకు స్పీకర్ మైక్ ఇవ్వడం లేదని ఆరోపించారు. తమకంటే తక్కువ సంఖ్యలో ఉన్న సభ్యులకు మైక్ ఇచ్చారని పేర్కొన్నారు. అసెంబ్లీ హౌస్ కమిటీలను ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని, దీనికి స్పీకర్ బాధ్యత వహించాలా లేక శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిదా అని ప్రశ్నించారు. ఎరువుల కొరత, రైతు బంధు, రుణమాఫీ, పంట బోనస్, 5 లక్షల కోట్ల హిల్ట్ పాలసీ కుంభకోణం, జాబ్ క్యాలెండర్, ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెండింగ్, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలపై అసెంబ్లీలో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. గురుకుల విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్‌తో ఆస్పత్రులకు వెళ్లిన ఘటనలపైనా చర్చ జరగాలన్నారు. కృష్ణా జలాలపై కాంగ్రెస్ చేస్తున్న అన్ని ఆరోపణలకు సభలోనే ఆధారాలతో సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. 299 టీఎంసీలకు ఒప్పుకున్నది గత కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం కాదని, ప్రశ్నించే గొంతులను నొక్కే పాలన చేస్తోందని విమర్శించారు. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు మాట్లాడే అవకాశం ఇస్తే బీఆర్ఎస్‌కు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.



రాష్ట్రానికి కేంద్రం షాక్.. 'ఉపాధి' పనివేళలు పెంపు

- నిధుల్లో భారీ కోత.. రాష్ట్రానికి 1500 కోట్ల భారం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్28: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామీ పాత పథకాన్ని రద్దుచేసి, కొత్త పథకాన్ని తీసుకువచ్చిన ప్రభుత్వం రాష్ట్రానికి షాక్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రానికి దిమ్మతిరిగే షాక్ ఇచ్చిన కేంద్రం ఉపాధి హామీ పనులను వంద రోజుల నుండి 125 రోజులకు పెంచుతూనే, ఇచ్చే నిధులను మాత్రం కుదించింది. అయితే ఇంతకుముందు ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకంతో, ఈ స్కీం కింద పనిచేస్తున్న కూలీలకు ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం మాత్రమే డబ్బులు చెల్లిస్తుంది. కొత్తగా మారిన పథకంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా కూలీలకు నిధులు చెల్లించాల్సి ఉంటుంది. ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వ 40 శాతం భరించాల్సి ఉంటుంది. ఇందులో మరొక కీలక మార్పులు కూడా చేశారు. ఇప్పటివరకు ఉపాధిహామీ అనేది హక్కుగా ఉండేది. కానీ ప్రస్తుత ఆ హక్కును తొలగించి రాష్ట్రం మొత్తం కాకుండా ఎంపిక చేసిన, అవసరమైన చోట్లనే అమలు చేయడానికి కేంద్ర నిర్ణయించింది. రాష్ట్రంపై భారీగా ఆర్థిక భారం కేంద్రం కేటాయించిన నిధులు ఖర్చు చేస్తే, ఆ తర్వాత ఒకవేళ పని చేసిన రాష్ట్రం నిధులను చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ఇది రాష్ట్రంపైన ఆర్థికంగా భారాన్ని వేస్తుంది. తెలంగాణలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు ప్రతి సంవత్సరం నేరుగా వాళ్ల ఖాతాలలో దాదాపు 2600 కోట్ల రూపాయలు జమ అవుతున్నాయి.

జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు ఇవ్వాలి

- జీవో 252 వెంటనే రద్దు చేయాలి
- తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 28: రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ సమానంగా అక్రెడిటేషన్లు ఇవ్వాలని తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 252ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ జీవోకు వ్యతిరేకంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా చేపడుతున్న ఉద్యమానికి జాగృతి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో 23 వేల మందికి పైగా వివిధ విభాగాలకు చెందిన జర్నలిస్టులు ఉన్నారని, వారందరికీ సమాన హక్కులతో అక్రిడేషన్లు కల్పించేందుకు గత ప్రభుత్వం 2016లో జీవో 239ను విడుదల చేసిందని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులుగా విభజిస్తూ మీడియాను రెండు వర్గాలుగా చీల్చుతోందని విమర్శించారు. డెస్క్ జర్నలిస్టులకు వేరు మీడియా కార్డులు ఇస్తామని చెప్పడం ద్వారా గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. రెండు రకాల అక్రెడిటేషన్లు ఉన్నప్పటికీ హక్కులు సమానమని ప్రభుత్వం చెబుతుంటే, వేర్వేరు పేర్ల అవసరం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రజల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోందని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే మీడియాను కూడా సీఎం వదలకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. జీవో 252ను రద్దు చేసే వరకు ప్రభుత్వం మీద పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో కూడా జర్నలిస్టులకు అన్యాయం జరిగిందని, ఆరోగ్య కార్డులకు సంబంధించి తగిన నిధులు విడుదల కాలేదని గుర్తు చేశారు. దీంతో అనారోగ్యానికి గురైన జర్నలిస్టుల కుటుంబాలు సొంత ఖర్చులతో చికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మీడియాను విభజించి చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించిన రూప్ సింగ్, జీవో 252 రద్దు చేసే వరకు జాగృతి మీడియా పోరాటాలకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

60 మంది ఎస్‌డబ్ల్యూఎం డీఈఈల బదిలీ

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉత్తర్వులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 28: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధి విస్తరణతో పాటు పరిపాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యూఎం) విభాగంలో 60 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను బదిలీ చేస్తూ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 27 మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి అనుగుణంగా జీహెచ్‌ఎంసీని 12 జోన్లు, 60 సర్కిల్స్‌గా పునర్వ్యవస్థీకరించింది. ఈ నేపథ్యంలో విస్తరించిన గ్రేటర్ పరిధిలో చెత్త సేకరణ, నిర్వహణ సమర్థవంతంగా సాగేందుకు ఈ బదిలీలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. బదిలీ అయిన ఇంజినీర్లు వెంటనే కొత్త పోస్టుల్లో బాధ్యతలు స్వీకరించాలని, సంబంధిత సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు దీనికి సహకరించాలని ఆదేశాలు జారీ చేశారు.

డెస్క్ జర్నలిస్టులందరికీ న్యాయం చేస్తాం

- బస్ పాస్లతో సహా అన్ని వర్తింపజేయిస్తాం
- అవాస్తవాలను నమ్మొద్దు
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

ప్రతిపక్షం బ్యూరో, ఉత్తర తెలంగాణ, హైదరాబాద్: జర్నలిస్టుల సంక్షేమం కోసం గత 70 ఏళ్లుగా పాటుపడుతున్న తమ సంఘం డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, బస్ పాస్లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేసేందుకు తాము ప్రభుత్వంతో చర్చించి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ భరోసా ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టులను ఇతర జర్నలిస్టులను తాము వేరుగా చూడడం లేదని, వారికి కూడా బస్ పాస్లతో సహా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని తప్పకుండా వర్తింపచేయిస్తామని అన్నారు. ఆదివారం బషీర్ బాగ్లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ముఖ్యుల సమావేశానంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 ఏళ్ల కాలంలో డెస్క్ జర్నలిస్టులకు కొంతమందికి మాత్రమే అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చారని, కానీ ఇప్పుడు తాము డెస్క్‌లో పనిచేసే జర్నలిస్టులందరికీ మీడియా కార్డులు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డుతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా కృషిచేస్తామన్నారు. ఉనికి చాటుకోవడానికి కొన్ని సంఘాలు, డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందంటూ గగ్గోలు పెట్టడంలో వాస్తవం లేదని, అబద్దాలు, కల్పితాలతో వాళ్ళు చేస్తున్న అపోహలు నమ్మవద్దని ఆయన జర్నలిస్టులను కోరారు. 252 జీవో తో 13వేల అక్రెడిటేషన్ కార్డులు తగ్గుతున్నట్లు ఆందోళన చేస్తున్న సంఘానికి ఎవరు చెప్పారని ఆయన ప్రశ్నించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డులు అందేలా చేయడమే టీయుడబ్ల్యూజే ప్రధాన ధ్యేయం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 3వేల అక్రెడిటేషన్లను 12 వేలకు పెంచిన ఘనత తమ సంఘానిదేనన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా 23 వేల 252 జీవో తెచ్చి జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ ఆధ్వర్యంలో ఏడుగురు ప్రముఖులైన పాత్రికేయులతో కమిటీ ఏర్పాటై, ఐదారుసార్లు సమావేశమై మార్గదర్శకాలు రూపొందించిన విషయం గగ్గోలు చేస్తున్న మిత్రులకు తెలియదా? అని విరాహత్ ప్రశ్నించారు. ఆ జీవోతో చిన్న మధ్య తరహా పత్రికలకు, ఉర్దూ పత్రికలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దాదాపు 4500 అక్రెడిటేషన్ కార్డులు తొగించబడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ ఇటీవల తమ సంఘం సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ముందు రెండు వేల మంది జర్నలిస్టులతో నిర్వహించిన మహా ధర్నాతో ప్రభుత్వం దిగివచ్చి యుద్ధప్రాతిపదికన జీవో జారీ చేసిందన్నారు. అయితే ఆస్తిత్వం కోసం, ఉనికిని చాటుకోవడానికి ఒక సంఘం తమ సంఘ జాతీయ నాయకుడిపై దుష్ప్రచారం చేస్తూ అలజడి సృష్టించడం సహించరానిదన్నారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో వర్కింగ్ జర్నలిస్టులకు అందిన సంక్షేమ పథకాలన్నీ తమ సంఘం పోరాట ఫలితమేనన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీయుడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్యారి రాములు, ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు, కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వరకాల యాదగిరి, జి. మధు గౌడ్, కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రాజేష్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- జానపద సకలవృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సంధ్య గౌడ్

ప్రతిపక్షం ప్రతినిధి, పెద్దపల్లి, డిసెంబర్ 28: పెద్దపెల్లి పట్టణం నందిని గార్డెన్లో తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం పెద్దపల్లి జిల్లా కళాకారుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సభాధ్యక్షులుగా ప్రముఖ రచయిత డాక్టర్ అందెశ్రీ స్మృతిలో రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జానపద సకల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తాళ్లపల్లి సంధ్య హాజరై వృత్తి కళాకారులు ఉద్దేశించి మాట్లాడారు. జనం తోడు వచ్చింది జానపదం.. ఈ కళలను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఆమె అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వచ్చే మార్చి నెలలో సమస్యలు పరిష్కారం కోసం ఇందిరా పార్క్ వద్ద 'హలో కళాకారుడా.. చలో హైదరాబాద్' చేపట్టబోతున్నట్టు ఆమె తెలిపారు. సకల వృత్తి కళాకారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె వేడుకున్నారు. అన్ని జిల్లాలలో సదస్సులు ఏర్పాటు చేస్తామని, జిల్లా కమిటీలు వేస్తూ అన్ని జిల్లా పర్యటన చేస్తామని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వలస సుభాష్ చంద్ర బోస్ కళాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కళాకారుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. కళాకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కళాకారులంతా ఐక్యతతో సంఘటితంతో ముందుకు పోవాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో జానపద అకాడమీ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాల్వ శ్రీరాంపూర్ మాజీ జడ్పీటీసీ సారయ్య గౌడ్, జానపద సకలవృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఎద్దు మమత, కార్యవర్గ సభ్యులు కేశవేణి రమాదేవి, బూడిద అనసూయ, సీనియర్ కళాకారులు కొమురయ్య, నాంపల్లి సింధుజ, బూడిది కందుకూరి లలిత, మల్లమ్మ, కే రమాదేవి, స్వాతి, దివ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

కన్నుల పండువగా అయ్యప్ప మహా పడిపూజ

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 28: స్వామియే శరణం అయ్యప్ప అయ్యప్ప శరణం స్వామియే శరణం శరణం అయ్యప్ప శరణం అంటూ అయ్యప్ప స్వామి శరణు ఘోషతో మండల పరిధిలోని యెన్కెపల్లి గ్రామం మారుమ్రోగింది. ఆదివారం ఉదయం సన్నిధానం స్వామి కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. గురుస్వాముల నేతృత్వంలో జరిగిన పూజా కార్యక్రమంలో వందలాది మంది అయ్యప్ప స్వాములు పాల్గొని అయ్యప్ప నామ స్మరణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు.అయ్యప్ప స్వాములు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అయ్యప్ప స్వామిని కీర్తిస్తూ మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. 18 పడి మెట్లకు పూజలు చేశారు. అనంతరం ఇరుముడులు కట్టుకుని అయ్యప్ప స్వాములు శబరిమలకు బయల్దేరారు. అనంతరం, యెన్కెపల్లి మాజీ ఎంపిటిసి రితీష్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సన్నిధానం గురు స్వామి కుమ్మరి కృష్ణ గురుస్వామి, అనంతరెడ్డి గురుస్వామి, నరసింహ ముదిరాజ్ గురు స్వామి, శేఖర్ గౌడ్ స్వామి, వెంకటేష్ స్వామి, ఆంజనేయ స్వామి, మల్లేష్ యాదవ్ స్వామి, మనోజ్ యాదవ్ స్వామి, పరమేష్ యాదవ్ స్వామి, పవన్ యాదవ్ స్వామి, శ్రీకాంత్ గౌడ్ స్వామి, రాజు స్వామి, వడ్డే శ్రీనివాస స్వామి, కుమ్మరి వెంకటేష్ స్వామి, వెంకటేష్ గౌడ్ స్వామి , మహేందర్ స్వామి, ఈ కార్యక్రమంలో భక్తులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలను అనుమతులు తప్పనిసరి

- మొయినాబాద్ సీ ఐ పవన్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 28: మొయినాబాద్ పోలీస్ స్టేషన్ సీఐ పవన్ కుమార్ రెడ్డి, ఆధ్వర్యంలో రాజేందర్ నగర్ జోన్ 03 సీ ఐ, ఎస్ ఐ 07, సివిల్, ఏఆర్ సిబ్బందితో కలిసి 70 మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీత్ నగర్, నాగిరెడ్డి గూడా, సురంగల్, శ్రీరామ్ నగర్, కుత్బుద్దీన్ గూడ, గ్రామాలలో ఉన్న 50 ఫామ్ హౌస్ లో తనిఖీలు చేపట్టారు. నిబంధనలను ఉల్లంఘించి పార్టీ నిర్వాహకులు, ఫామ్ హౌస్ ఓనర్లపై కేసులు నమోదు చేశారు. గోల్డెన్ మెడోస్ ఫామ్ హౌస్, కుత్బుద్దీన్ గూడ, జా ఫామ్ హౌస్ అజీజ్ నగర్ ,గున్న ఫామ్ హౌస్, కుత్బుద్దీన్ గూడ ఫామ్ హౌస్ యజమానులు, పార్టీ నిర్వాహకులు తగ్గిన ప్రభుత్వ అనుమతులు తీసుకొని పార్టీలు నిర్వహించుకోవాలన్నారు. ఎవరైనా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా లిక్కర్ పార్టీలు లేదా చెట్ట వ్యతిరేకత కార్య కలపాలు, మత్తు పదార్థాలు సేవించడం, గంజాయి, డ్రగ్స్, హుక్కా, బెట్టింగ్, వ్యభిచారం వంటివి నిర్వహిస్తే ఫామ్ హౌస్ లో సీజ్ చేస్తామని, ఫామ్ హౌస్ యజమానులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



జీవో 252 ను సవరించాలి : టీయూడబ్ల్యూజే ఐజేయూ

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, డిసెంబర్ 28 : అక్రిడిటేషన్ల కోసం నూతనంగా విడుదలైన జీవో 252లో మండలానికి ఒక్క అక్రిడిటేషన్ నిబంధనతో మేడ్చల్ జిల్లా జర్నలిస్టులు ఆందోళకు గురికావాల్సిన అవసరం లేదని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నూతన జీవోలో మండలానికి ఒక్క కార్డు నిబంధన వల్ల గ్రేటర్ పరిధిలో అర్బన్ మండలాలో ప్రధాన పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని మీడియా అకాడమీ చైర్మన్ దృష్టికి ఆదివారం తీసుకెళ్లడం జరిగింది. టి యు డబ్ల్యూ జె ఐజేయు హెచ్ యూ జె, మేడ్చల్, రంగారెడ్డి, జిల్లాల ప్రతినిధుల బృందం ఈ మేరకు కలిసి వినతి పత్రం అందజేశారు. అర్బన్ మండలాలో ప్రధాన పత్రికలలో కనీసం ముగ్గురు నుంచి నలుగురు విలేకరులు పనిచేస్తున్నారని ఒకటే కార్డు విధానంతో మిగిలిన వారికి నష్టం జరుగుతుందని వివరించారు. గతంలో మాదిరిగ పనిచేస్తూన్న వారికి కార్డులు వచ్చేలా జీవోను సవరించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఇందుకు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. నిజమైన జర్నలిస్టులకు ఇబ్బందులు తలేత్తకుండా చూస్తామని తెలిపారు. తన దృష్టికి వచ్చిన వాటిని పరిశీలించి ఖచ్చితంగా సవరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, హెచ్ యు జె అధ్యక్షులు శంకర్ గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీమ్, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

“

మిగతా ఇండస్ట్రీల నుంచి కన్నడ సినిమాలకు పెద్దగా సపోర్ట్ దొరకట్లేదు. నేను, శివరాజ్ కుమార్, ఉపేంద్ర పలు భాషల్లో అతిథి పాత్రలు చేశాం. నేను కొన్నిసార్లు డబ్బులే తీసుకోలేదు. కానీ ఆయా భాషల నటులు కన్నడ చిత్రాల్లో యాక్ట్ చేసేందుకు ఆసక్తి చూపించడం లేదు. నేను వ్యక్తిగతంగా కొందరు యాక్టర్స్‌ను అడిగినా నటించలేదు.

\- హీరో కిచ్చా సుదీప్

బహుళ

పర్యటన

అమెరికా నేలపై మా మొదటి అడుగు

ఉండవిల్లి సుజాతా మూర్తి
93472 48428

ఏప్రిల్ నెలలో మా అబ్బాయి కాన్వొకేషన్ కోసం అమెరికా వెళ్లాలనుకున్నాం. కానీ "నేను సాధించింది పెద్దగా ఏమీ కాదు అమ్మా.. ఇది సర్వసాధారణమే" అని మా అబ్బాయి అనడంతో ఆ ప్రయాణం ఆగిపోయింది. ఇదిగో, ఈ నవంబర్‌లో ఆ అవకాశం కుదిరింది. చాలా చలిగా ఉంటుంది అని అందరూ అన్నారు. అయినా మనసులో ఏదో తెలియని ఉత్సాహం. విశాఖపట్నంలో ఉదయం ఆరు గంటలకు బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్ట్ చేరుకున్నాం. మాకు ఇది అమెరికాకు మొదటి ప్రయాణం. పదహారు గంటల సుదీర్ఘ విమాన ప్రయాణం. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఎయిర్‌హోస్టెస్‌లు ఏదో ఒకటి తినడానికి, తాగడానికి ఇస్తూనే ఉన్నారు. వేడి వేడి భోజనం, చిరునవ్వులు - ప్రయాణ అలసటను కొంత తేలిక చేశాయి.

యూరప్ మీదుగా విమానం సాగింది. ఉదయం అయింది..మళ్లీ సిబ్బంది హడావుడి. బ్రేక్‌ఫాస్ట్, కాఫీ సర్వింగ్ మొదలైంది. చివరికి... పదహారు గంటల అనంతరం విమానం న్యూయార్క్ చేరుకుంది. మా అబ్బాయి ముందే వీల్‌చైర్ ఏర్పాటు చేయడంతో విమానం తలుపు దగ్గరకే అది వచ్చింది. అక్కడ ఇద్దరు పంజాబీ అమ్మాయిలు హడావుడిగా మమ్మల్ని నేరుగా లగేజ్ బెల్ట్ దగ్గరకు తీసుకెళ్లారు. న్యూయార్క్ విమానాశ్రయం అద్భుతం. అతి విశాలం.. కళ్లు తిరిగేంత పెద్దది. లగేజ్ ట్రాలీకి డబ్బులు చెల్లించాలి. లేకపోతే అది ఓపెన్ కాదు. మా వారు డబ్బులు చెల్లించి రెండు ట్రాలీలు తీసుకున్నారు. ఆ అమ్మాయిలే మమ్మల్ని అక్కడినుంచి ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వరకు తీసుకెళ్లారు. టెర్మినల్ లింక్ ట్రైన్ ఎక్కించారు. మాతోబాటే వచ్చి లగేజ్ చెక్‌ఇన్ చేయించి, ఎంట్రీ వరకూ తీసుకొచ్చి దింపి వెళ్లారు. వాళ్లకు చెరో పదిహేను డాలర్లు ఇచ్చాము. చాలా సంతోషించారు. "మీరు ఇండియా నుంచి వచ్చిన అమ్మా-నాన్నల్లా ఉన్నారు" అని అనడంతో మనసు నిండిపోయింది. రెండు గంటల తర్వాత మా అబ్బాయి ఊరిలోని ఫ్లైట్ ల్యాండ్ అయింది. మేము విమానం దిగి లగేజ్ కోసం ఎదురు చూడాల్సిన అవసరమే లేదు. మా అబ్బాయి లగేజ్ తీసుకుని ఎదురు చూస్తున్నాడు. ఆనందాలింగనాల తర్వాత టాక్సీ స్టాండ్‌కు వచ్చి ఇంటికి బయలుదేరాం. ఇరవై నిమిషాల్లోనే మా అబ్బాయి ఇంటికి చేరుకున్నాం. అలా.. అమెరికా నేలపై మా మొదటి అడుగు పడింది. చంద్రునిపై మొదట అడుగు పెట్టినప్పుడు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ కూడా ఇంతగా ఫీల్ కాలేదేమో కానీ మేము మాత్రం అలా ఫీల్ అయ్యాం.

(వ్యాసకర్త వ్యాఖ్యాత్రి, రచయిత్రి, వార్తాచదువరి, గాయని)

పరిచయం

కొంకణి సాహిత్యంలో అద్వితీయ సంవేదనాత్మక కవిత్వప్రవాహం

పరేష్ నరేంద్ర కామత్

డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

బహుభాషా కేంద్రమైన గోవా బహుళ సంస్కృతులు మత విశ్వాసాలు పరిఢవిల్లే పర్యాటక విలక్షణ స్వర్గధామం. దాదాపు నాలుగున్నర శతాబ్దాల పాటు పోర్చుగీస్ పాలన మగ్గింది. తర్వాత 1861లో స్వతంత్ర గోవాగా, 1987లో స్వతంత్ర భారత్ లో 25వ రాష్ట్రంగా వెలిచిన ప్రకృతి అందాల సీమలో స్వేచ్ఛగా ప్రహిస్తూ మెలకువలో నిద్రలో పాఠకుల ప్రేరణతో ఉత్ప్రేరక చోదక శక్తిగా ఉంది కవిత్వం. కొంకణి భాషాసాహిత్యాల ఉద్యమ నేపథ్యం కొత్త కాదు.అయినా ప్రతి సందర్భం ఏకైక ప్రత్యేకమైనదే కోంకణి నేలలో పుండలీక్ నాయక్, హేమానాయక్ వంటి ఎందరో సాహిత్యకారుల కృషి తపన మరిచిపోలేనిది. ఉద్యమనేపథ్యం,పోరాటం కోంకణి భాషాసాహిత్యాలకు జీవధారగా నిలిచాయి.ప్రముఖ కొంకణి కవి పరేష్ నరేంద్ర కామత్ కోంకణి కూడా కోంకణి భాషకు గట్టి మద్దతును అందించిన గొప్ప రచయిత. ఆయన కొంకణి భాషకు గోవా అధికారిక భాష హోదా సాధనకు చేసిన ఉద్యమంలోనూ, భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో స్థానం పొందే క్రమంలో భాషోద్యమ పోరాటం సలిపి విజయం సాధించడంలోనూ కీలక పాత్ర పోషించారు.ఆయన రాసిన ఐదు కవితా సంకలనాలలో అలాంగ్ 2000లో, గర్భకోల్ 2004లో, శుభంకర్ 2009లో, చిత్రలిపి 2013లో ప్రచురిస్తే రంగబోలి 2018లో పబ్లిష్ చేశారు. ఆయన కవితలు ఆయన కవిత్వం హిందీ, సింధీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ మరియు ఆంగ్ల భాషలలోకి కూడా అనువదించబడింది. ఆయన కవిత్వ గ్రంథం 'చిత్రలిపి' 2018లో కోసం కొంకణిలో ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందింది. ఆయనకు రాష్ట్ర కళా అకాడమీ సాహిత్య పురస్కార్ 2009లో వస్తే గోవా ప్రభుత్వం యువ సృజన్ పురస్కారం 2011 2012లో బహూకరించింది. ఆయన కొంకణి భాషలో గొప్ప రచయిత. ఆయన నవలలు, నాటకాలు ఇంకా కవితలకు ప్రసిద్ధి. ఆయన రచనలలో 'వోడ్లెం ఘోర్', 'కటోర్ రే భాజీ' వంటివి కూడా ఉన్నాయి. 'చిత్రలిపి'తో పాటు 'గారస' (Garasa) వంటి ఇతర ప్రముఖ కవితా సంపుటాలలో కూడా. ఫార్మకాలజీ కోర్స్ చదివిన ఆయన గోవా ప్రభుత్వంలో సమాచార శాఖలో అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక పరేష్ నరేంద్ర కామత్ కొంకణి 'ముయాంచి కవిత'కు నా తెలుగు అనువాదం...

"ఎలుకల కవిత"

◇◇◇◇◇◇◇◇◇◇◇◇◇◇◇◇◇◇◇◇

'నేను కలగంటున్నాను ఎలుకలను
మరి నా ఆలోచనలు కనుమరుగు
ఎలుకలు వస్తాయి
ఎలుకలు పోతాయి
మధ్యలో అవి నవ్వుతాయి
వీటి మధ్యన నవ్వు ఆగుతుంది
అవి ముద్దాడుకుంటాయి

నేను ఆలోచనలో...
వీటిలో కొన్ని ఎక్కడనుండి వస్తాయి?
మరి కొన్ని ఎక్కడికి పోతాయి?
అవి ఏమి చెప్పాలని అనుకుంటున్నాయి?
అవి ఏమి మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాయి?
అవి ఎలా ప్రేమిస్తాయి?, ముయా!

పరుగులేని చిరు కదలికల నుండి
నేను నల్లని పాద నడకలు చూస్తాను
ఎలుకల పాదముద్రల అనుసరిచాను నేను
నెమ్మదగా వాటితో నేను నడవడం ప్రారంభించాను
చీకటి కలల ఎలుకల భాషను
నేను అర్థం చేసుకోవాలి
నా సొంత మాటల్లో వ్యక్తపరుచాలి
నా లోపల ఆ రెండూ చూడాలి అందమైన
కనులలో
నవ్వుతున్న ఎలుకలు ఇంకా నవ్వుతూనే
ఉన్నవి,వెంటనే
వాటి కనులలో కన్నీరు నిండింది
వాటి కనుల నుండి కన్నీరు స్రవిస్తుంది

నా నిద్ర చెదిరిపోయింది
ఎలుకల కళ్ళనుండి కన్నీటి ప్రవాహం సాగుతుంది
కారే కన్నీరు మరీ పెద్దగా మారింది
భూమి వలె పెద్ద పరిమాణంలో
అది కదలించే ప్రయత్నం చేస్తూ
నా కాళ్లుచేతులు కరిగిపోతున్నాయి
నా గుండె ద్రవిస్తున్నది

మరెక్కడి నుండో అవి
బట్టలు (రిగ్) కత్తిరించుకొనివస్తున్నాయి
నా కలల్లోకి వచ్చాయి ఎలుకలు;
కవిగా నీ గుండె పగిలేలా
అవి నన్ను రమ్మనే ప్రేమతో
రమ్మనే!మాతో కలిసి!...

ఇలా ఎలుకలు బట్టలు కత్తిరించే జీవితంతో, భూమ్మీదికి రాకపోకలు సాగించడం, ప్రేమించుకోవడం, స్వేచ్ఛగా తిరుగుతూ, కవినీ తమతో కలిసి రమ్మడం మానవీయ భావనాత్మక ప్రతీకగా కవిత్వీకరిచడం కవిలోని ప్రేమ తత్వానికి గొప్ప సూచిక. మనిషిని,జంతువును ప్రేమించడం గొప్ప కళ, అది కవి అనుభూతి, ఆలోచనలకు గొప్ప కవిత్వానికీ మహా ప్రేరణ.

కవిత

తెలుగు యాత్రలు వెలుగు జ్యోతులు

నాడు తెలుగు
తాటిచెట్ల నీడల్లో, తల్లుల ఒడుల్లో
తాతల కథల్లో, పల్లె పొలాల్లో
పలుకుల పరిమళం.

నేడు తెలుగు
డిజిటల్ తెరలపై డాలర్ల దేశాల్లో
విమానాల రెక్కలపై సరిహద్దులు దాటిన
స్వర్ణాక్షర సంచారం.

ఆంధ్రాలో అమ్మతనపు అక్షరాలు,
తెలంగాణాలో తేజోమయమైన తేటతనం,
తమిళనాడులో తేనెచుక్కల తెలుగు పలుకులు,
కర్నాటకలో కన్నడ గంధంతో కలిసిన కవితా సౌరభం.

ఒరిస్సాలో
ఉత్కలుల ఉల్లాల్లో ఊయలలూగే పదాలలాలిత్యం,
మహారాష్ట్రలో
మరాఠీ మన్నులో మేళవించిన మధురగానం.

అమెరికాలో
సిలికాన్ లోయలో సంస్కృతి సెమినార్లలో సంస్కారస్వరం,
ఆస్ట్రేలియాలో సముద్ర అలలతో కలిసి
సరసమైన సాహితీ సుగంధం.

ఇంగ్లాండులో
వర్షపు వీధుల్లో వర్ణాల వేదనాడి,
మలేషియాలో మలయ మల్లెలతో
మిళితమైన మాధుర్యం.

మారిషస్సులో
క్రిష్ణాగోదావరీ నదీతీరపు గుండె చప్పుడు,
కెనడాలో
మంచు మధ్య మదిని కరిగించే మాతృభాష మమకారం.

ఆరబ్బు దేశాల్లో
అభివృద్ధి చెందుతున్న ఆంధ్రుల మాతృభాషావాడకం
శ్రీలంకలో
సీతాదేవి అడుగుల జాడలో సంస్కృతీ సంచారం.

నాడు పల్లెటూరి పుట్టిల్లు,
నేడు విశ్వగ్రామపు వెలుగు,
తెలుగు - ఒక భాష కాదు..
ఒక తల్లి గుండె చప్పుడు, ఒక జాతి ఆత్మగానం!

తెలుగు వేదికల్లో
తెలుగు భాషని పొగుడుదాం.. తెలుగుతల్లికి హారతులిద్దాం
తెలుగు జాతికి జైకొడదాం.. తెలుగుఖ్యాతిని చాటుదాం
తెలుగు వైభవాన్ని తెలుపుదాం.. తెలుగువెలుగులు చల్లుదాం



గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం

సమీక్ష

అక్షరం చెక్కిన గంగ దర్వాజ

డా. అమ్మిన శ్రీనివాసరాజు
77298 83223

'చూసే చూపును బట్టి వస్తువు, వ్యక్తి, అందం రెండింతలు అయినట్టు" వ్రాసే వ్రాత వ్యక్తిని బట్టి ఆయా రచన విలువ పెరుగుతుంది. సృజనకు అనుభవం తోడైతే "పసిడికి పన్నీరు పూసిన చందమే!' ఈ సామెత సాహిత్యానికి చక్కగా సరిపోతుంది. అందులో భాగంగానే కరీంనగర్ కవి ప్రామాణిక పరిశోధక రచయిత, మీదు మిక్కిలి చక్కని ఉపన్యాసకుడు, డాక్టర్ మట్టా సంపత్ కుమార్ రెడ్డి రాసిన తొలి పుస్తకం "గంగ దర్వాజ" అముద్రిత రచయితగా తనకు తాను ప్రకటించుకున్న ఈ సహృదయ కవి సంపత్ కుమార్ గారి కలం చూపు సదా తెలంగాణ సంస్కృతి, గ్రామీణ తెలంగాణ జీవనం, వెంటే ఉంటుంది. కవితాత్మకంగా సాగిన ఈ చిరు ముచ్చట్ల వ్యాస సంపుటిలోని రచనా శైలి పాఠకులను కట్టిపడేస్తుంది. గతం తాలూకు మనవైన జ్ఞాపకాల దారుల వెంట నడిపిస్తూ మధురానుభూతులు అందిస్తారు. రచయిత రచన శైలి పాఠకులను కట్టిపడేస్తుంది. గతం తాలూకు మనవై జ్ఞాపకాల దారుల వెంట నడిపిస్తూ మధురానుభూతులు అందిస్తారు రచయిత. అనునిత్యం మనం అతి సాధారణంగా చూసే వస్తువులు విషయాల వెనుక ఇంతటి సంస్కృతి సంగతులు నెలకొని ఉన్నాయా?! అనే ఆశ్చర్యానుభూతులు పాఠకుల సొంతం అవుతాయి. ఇక ఇందులో సామెతలు జాతీయాలకు కొదవేలేదు, అచ్చ తెలుగు తెలంగాణ సంస్కృతి సంపదలతో పాటు ఎంతో విలువైన యాస, భాషలను సైతం రచయిత తనదైన అనుభవాల లోతుల్లోంచి ఒడిసి పట్టి అందంగా అందించారు.

ఒకవైపు అలనాటి అందాల తెలంగాణ సంస్కృతి గుర్తు చేస్తూనే అది అంతా నేడు కనుమరుగైపోతుందని, గుర్తు చేస్తాడు రచయిత, నాటి బంధాలు సంబంధాలు జీవన విధానం అంతా ఐకమత్యం నిస్వార్థం త్యాగం ఆత్మీయతలతో నిండి ఉండేవి, కానీ అవినేడు స్వార్థం



అవసరం వ్యాపారమయంగా మారిపోయాయి అంటూ తనదైన ధర్మాగ్రహం వెళ్లబుచ్చారు. "కుడకవక్కలు బెల్లం ముక్కలు" ముచ్చటలో.. గత కాలంలో దేవునికి కొట్టిన కొబ్బరికాయకు పంచదార కలిపి చుట్టుపక్కల వారందరికీ పలహారం పంచి పెట్టేవారు కానీ నేటి తరానికి పలహారం తీసుకోవడం నామోషి కావడమే కాదు పంచిపెట్టే వారికి తీరిక ఉండటం లేదు, కానీ చక్కగా కొబ్బరి కుడకలు అమ్ముకోవడానికి వెనకాడటం లేదు అంటూ నేటి తరపు వ్యాపార ధోరణిపై సుతి మెత్తని చురక వేశారు.

పూర్వము మన ఆహారపు అలవాట్లు తినే తినుబండారాల్లో ఎంతటి ఆరోగ్యం నిండి ఉండేదో చెబుతూనే.. నేటి కాలంలో స్వార్థం నీడలో పర్యావరణం పాడైపోవడమే కాక, ప్రకృతి సిద్ధంగా ఉచితంగా దొరికే పండ్లు, కాయలు, చెట్లు, లేక ఎంత ఖరీదైపోయాయో వ్యంగ్యంగా చెబుతూనే నాటి ఆహారపు అలవాట్లలోని విలువలు చక్కగా చెప్పారు. "జీడి పండ్ల తులాభారం" ముచ్చటలో.. ఏడాదికోమారు దొరికే జీడిపండ్లలో ఎలాంటి ఔషధ గుణాలు ఉన్నాయో తెలియాలి అంటే అది ఆసాంతం చదవాల్సిందే మరి!

వాస్తు రీత్యా గాని ఇంటి అవసరాల రీత్యా గాని.. ప్రతి ఇంటికి ఉత్తరం దిక్కున తలుపు ఉండి తీరాలి, పూర్వం ప్రతి ఇంటికి ఈ దర్వాజాలు ఉండేవి ఈ ఉత్తర దిక్కున ఉండే దర్వాజ ఆ ఇంటికి ఎంతగా ఉపయోగకరమో తెలుపుతూ దాని అవసరం తాలూకు గుర్తుగా.."గంగ దర్వాజ చేసే సేవకు ఆ తొక్కుడు బండే ఒక నున్నటి ఆనువాలు...!" అనే ఏక వాక్యంతో ముగిస్తూ అనేక విషయాలు తలపోస్తారు రచయిత. ఇంతకీ ఉత్తరదిక్కు దర్వాజా గంగాధర్వాజా ఎందుకయిందో అని తెగ ఆసక్తి కలుగుతుంది కదూ.. ఆలస్యం చేయకుండా ఆ పుస్తకం సొంతం చేసుకుని చదివేస్తే చాలు, అలాంటి ఆసక్తి దాయకమైన మరెన్నో విషయాలకు కారణాలు తెలియడమే కాదు బోలెడు మతలబులు మనకు అర్థం అవుతాయి. భాషకు జీవకర్రాలు వంటి సామెతలు ఇందులో అనేకం ఏరుకోవచ్చు, ఉప్మాలోజీడి బద్దలు ఏరుకున్నట్టు.. మచ్చుకు.."ఏది చూడబోయిన అగ్గిల చెయ్యి బెట్టి నట్టేనాయె"," లోటపెట పెదవులకు నక్క ఆశ పడ్డట్టు","చెప్పుకుంటే మానం పోతది చెప్పకుంటే పానం పోతది", వంటి అచ్చ తెలంగాణ సామెతలు ఇందులో అనేకం అగుపిస్తాయి, ఇకపోతే రచయిత ఎంచుకున్న అంశాలకు పెట్టిన పేర్లు కూడా అంతే గమ్మత్తుగా ఉన్నాయి. పల్లిగిర్ని పరిమళం, ప్యాలాల ముద్దలు, మామిడికాయ మిరం, సారెగంపలు ఊరేగింపులు, కూరాడు నీరాడు, మలీద ముద్దలు, అన్న దానం చాట దానం, వంటి శీర్షికలు ఈ రకం ఆసక్తికర జాబితాలో చేరతాయి, ఎంతో విలువైన సంస్కృతి సాంప్రదాయాల ముచ్చట్లు సరదాగా సాగే ఈ అక్షరాల గదిలోకి "గంగ దర్వాజ" గుండా అందరం తప్పక చేరాలి.

గంగదర్వాజ, పేజీలు:164,
ధర:200/-రూ,
ప్రతులకు: వాఙ్మయిప్రచురణలు,
కరీంనగర్. సెల్:98494 70792

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రజల కోసం ఒక శక్తిగా కాంగ్రెస్ ఆవిర్భావం

- ఎక్స్‌వేదికగా సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్28: కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ఓ ఆసక్తికర ట్వీట్ చేశారు. భారత దేశ ప్రజల కోసం ఒక శక్తిగా 140 సంవత్సరాల క్రితం ఇదే రోజున కాంగ్రెస్ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించడం నుంచి రాజ్యాంగ నిర్మాణం వరకు, ప్రజాస్వామ్య సంస్థలను ఏర్పాటు చేయడం నుంచి విభిన్న దేశాన్ని ఏకం చేయడం వరకు ఆధునిక భారతదేశంలోని ప్రతి కీలక అధ్యాయాన్ని జాతీయ కాంగ్రెస్ తీర్చిదిద్దిందని కొనియాడారు. జాతీయ కాంగ్రెస్ చరిత్ర అనేది భారత ప్రజాస్వామ్య ప్రస్థానానికి ప్రతిరూపమని సీఎం రేవంత్ అన్నారు. సోనియా గాంధీ నాయకత్వాన్ని స్మరించుకుంటే సేవ, నిబద్ధత, నీతి, విలువలు కనిపిస్తాయని పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికలలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

- చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే ఎస్ రత్నం

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 28: ముఖ్య కార్యకర్తల సమావేశం మొయినాబాద్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు మాదాపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక సంస్థల ఎన్నికల కొరకు సమావేశం అయ్యారు, ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం మాట్లాడుతూ... రాబోయే మున్సిపల్ ఎన్నికలలో బిజెపి జెండా ఎగరడం ఖాయం అని మాజీ ఎమ్మెల్యే రత్నం అన్నారు, డిసెంబర్ 14 జరిగిన సర్పంచ్ ఎన్నికలలో మొయినాబాద్ లో మన బిజెపి పార్టీ నాయకులు నలుగురు గెలవడం చాల అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే రత్నం తెలిపారు, బూతు కార్యకర్తలు నాయకులు కలిసి గట్టుగా పనిచేయాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, చిలుకూరు మాజీ సర్పంచ్ గున్నాల గోపాల్ రెడ్డి, పడమటి మోహన్ రెడ్డి, శ్రీరాములు ముదిరాజ్, రాజు యాదవ్, దర్గా మహేందర్, తూర్పు మాధవరెడ్డి, డప్పు ఆనంద్, లక్ష్మీపతి యాదవ్, మండల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు,

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 28 : సంగారెడ్డి పట్టణంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో కాంగ్రెస్ పార్టీ 140 వ ఆవిర్భావ దినోత్సవం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా అధ్యక్షులు నిర్మలాజగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీ జండా ఆవిష్కరించారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్అన్నారు. దేశ నిర్మాణంలో ఎంతో మంది కాంగ్రెస్ నాయకుల ఆస్తులు, ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ముందుకు వెళ్లారని అన్నారు. ఈ రోజుల్లో బీజేపీ పార్టీ కి సంబంధించిన సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ పై దుష్ప్రచారాలు కాంగ్రెస్ నాయకులు ఫోటోలు మార్ఫింగ్ చేసి యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని యువత వారి కుట్ర ను గ్రహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ఆంజనేయులు, సిడిసి వారికి రామ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సదాశివపేట మండల అధ్యక్షులు సిద్దన్న, సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు జార్జ్, బుచ్చి రాములు, నర్సింహారెడ్డి, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్, శ్రీకాంతగౌడ్, బల్వంత్ రెడ్డి, అనిల్, చారి, తదితరులు పాల్గొన్నారు.

చర్చ్ పేరుతో అక్రమం? అధికారుల మౌనమే సాక్ష్యం

కుకట్ పల్లి, ప్రతిపక్షం, డిసెంబర్ 28: అల్విన్ కాలనీ డివిజన్ ఫేజ్-2లోని సర్వే నెం.336 ప్రభుత్వ భూమిపై గత మూడు నెలలుగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలు అధికారుల నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తున్నాయి. ఎటువంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా గుర్తు తెలియని వ్యక్తి అక్కడ షెడ్ నిర్మాణం చేపట్టడంతో స్థానికులలో తీవ్ర ఆందోళన నెలకొంది. నిర్మాణం చేస్తున్న వ్యక్తిని కాలనీ వాసులు ప్రశ్నించగా, అది చర్చ్ నిర్మాణం కోసమేనని చెప్పినట్లు సమాచారం. అయితే అదే స్థలంలో గత 40 సంవత్సరాలుగా చర్చ్ ఇప్పటికే ఉండగా, మరో నిర్మాణం ఎందుకు చేపడుతున్నారన్న ప్రశ్నకు అతడు సరైన సమాధానం ఇవ్వలేకపోయాడు. ఈ విషయాన్ని స్థానికులు కుకట్ పల్లి మండల రెవెన్యూ కార్యాలయానికి ఎం ఆర్ ఓ కి ఫిర్యాదు చేయగా, అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై రెవెన్యూ ఇన్స్పెక్టర్ అగస్టిన్ పోలీసుల సహాయంతో సంఘటనా స్థలానికి చేరుకుని నిర్మాణాన్ని తాత్కాలికంగా నిలిపివేసి, అక్రమ షెడ్‌ను తొలగించాలని ఆదేశిస్తూ కొంత గడువు ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. అయితే, ఈ చర్యలు కేవలం నాటకంగానే మిగిలాయని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఆర్ఐ ఇచ్చిన గడువును అక్రమ నిర్మాణాన్ని పూర్తిచేసుకునేందుకు ఉపయోగించుకున్నారని, అధికారుల మౌన సమ్మతితోనే ప్రభుత్వ భూమిపై నిర్మాణం పూర్తయ్యిందని వారు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు ఇలా వ్యవహరించడం తీవ్రంగా ఖండనీయమని స్థానికులు పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాన్ని తక్షణమే తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఉన్నతాధికారులు, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరిస్తున్నారు.

తండ్రి జ్ఞాపకార్థం వైకుంఠ రథం విరాళం

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 28 : మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామానికి చెందిన సామ శేఖర్ రెడ్డి తండ్రి దివంగత దయాకర్ రెడ్డి జ్ఞాపకార్థం వైకుంఠ రథాన్ని గ్రామానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ప్రజలు వైకుంఠ రథాన్ని ఉచితంగా వినియోగించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్యపాగ కృష్ణ, ఉప సర్పంచ్ జితేందర్ రెడ్డి, మన్నే ప్రభాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నారం రెడ్డి, కృష్ణా, సైపాల్ రెడ్డి, శేఖర్ యాదవ్, నారాయణ రెడ్డి, శంకర్ యాదవ్, నాగార్జున చారి, అత్తయ్య, కారొబర్ గోపాల్ చారి, గోపాల్, కళ్యాణం జంగా రెడ్డి, సామ వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

రౌతు రమేష్ కుమార్‌కు ఘన సన్మానం

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 28: హసన్పర్తి మండలంలో గత 33 సంవత్సరాలుగా విద్యుత్ సంస్థలో హెల్పర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి, క్రమశిక్షణతో, అంకితభావంతో సేవలందిస్తూ లైన్ ఇన్స్పెక్టర్ స్థాయి వరకు ఎదిగి, వినియోగదారుల మన్ననలు పొందిన రౌతు రమేష్ కుమార్ ఇటీవల పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా, హసన్పర్తి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఆదివారం రోజు, ఉద్యోగ సంఘాలు మరియు ఇతర పరపతి సంఘాల ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు తంగళ్ళపల్లి కుమారస్వామి, లక్ష్మణ్, వెంకటేశములు మాట్లాడుతూ రౌతు రమేష్ కుమార్ గారు కేవలం ఉద్యోగ బాధ్యతలకే పరిమితం కాకుండా, గొప్ప సామాజిక స్పృహతో డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా, అలాగే ఇతర సేవ సంఘాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ, బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడని ప్రశంసించారు. సాధారణంగా ఉద్యోగులు తమ విధి నిర్వహణకే పరిమితమవుతారు. అయితే రమేష్ కుమార్ మాత్రం ఉద్యోగ ధర్మంతో పాటు సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని, ఆయా గ్రామాల ప్రజల విశ్వాసం, ఆదరణ పొందిన అరుదైన వ్యక్తి అని పేర్కొన్నారు. ఉద్యోగానికి విరమణ ఉన్నా, ప్రజాసేవకు i విరమణ ఉండదని, భవిష్యత్తులోనూ తన అనుభవాన్ని సమాజ హితానికి వినియోగించుకుంటూ, సంఘ సేవలో ముందుండాలని ఆయనను కోరారు. అనంతరం సంఘ సభ్యులు రమేష్ కుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ తనకు ఇంతటి గౌరవప్రదమైన సన్మానం చేసిన ఉద్యోగ సంఘ నాయకులకు, సంఘ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో సదానందం, ఓదెలు, ఐలయ్య, బ్రహ్మం, రాజిరెడ్డి, వెంకటేశం, లక్ష్మణ్ కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సిగాచి పరిశ్రమ ఎండీ అమిత్ రాజ్ సిన్హా అరెస్ట్

- జుడీషియల్‌రిమాండుకు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ పరితోష్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 28 : పాశమైలారం పారిశ్రామిక వాడలోని, సిగాచి పరిశ్రమలో సంభవించిన అగ్ని ప్రమాదం ఘటనపై భానూర్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ కేసు నమోదైంది. విచారణలో భాగంగా నిందితుడైన సిగాచి పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అమిత్ రాజ్ సిన్హా ను శనివారం సాయంత్రం అరెస్ట్ చేసి, జుడీషియల్ రిమాండుకు తరలించారు. అరెస్ట్ అనంతరం న్యాయస్థానం నిందితుడిని 14 రోజుల జుడీషియల్ రిమాండుకు (జ్యూడిషల్ కస్టడీ) ఆదేశించడం జరిగింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని ఎస్పీ తెలియజేశారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 28 : జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ వారు ఆసియాలో విస్తరించి ఉన్న సమయంలో 1885 లో డిసెంబర్ 28 వ తేదీన ఏర్పడిన మొట్ట మొదటి జాతీయ పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. 1920 నుండి కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ నాయకత్వంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటంలో స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర కాంగ్రెస్ పార్టీ పోషించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని, ఇప్పటివరకు 17 సార్లు లోకసభ ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ 10సార్లు విజయం సాధించడం జరిగిందన్నారు. దేశ స్వాతంత్ర్యం లో ఉనికే లేని బీజేపీ నేడు దేశంలో తమవల్లనే అభివృద్ధి చెందుతుందని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో బీజేపీ దేశానికి చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో రాహుల్ గాంధీ గారిని ప్రధానిని చేస్తాం ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, ముఖ్య అతిథి రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, యూత్ కాంగ్రెస్ విపుల్ గౌడ్, వేణు రాజ్, రత్నాకర్, లింగం, రాజా నరేందర్ గౌడ్, శ్రీనివాస్, మీసాల సుధాకర్, వినయ్, మెయిన్, కేశ మహేష్, ఈసా, ఎజాజ్, సుభాష్ జాదవ్, కుద్దుస్, బలరాం, శివ, సంగెం సాయిలు, శ్రీశైలం, మాజీ మేయర్ సుజాత, పోల ఉష, చంద్రకళ, విజయలక్ష్మి, మీనా, బాల నర్సయ్య , పురుషోత్తం, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- డ్రగ్స్ వాడితే జైలుకే!- సీపీ గౌస్ ఆలం

ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్, డిసెంబర్ 28: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా డిసెంబర్ 31 రాత్రి ప్రత్యేక ఆంక్షలు అమలులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కమిషనరేట్ వ్యాప్తంగా 44 ప్రాంతాల్లో (మున్సిపల్ పరిధిలో 33 చోట్ల) డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ కేంద్రాలు ఏర్పాటు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారి వాహనాలను వెంటనే సీజ్ చేస్తాం. ప్రతి పాయింట్ వద్ద 810 మంది సిబ్బంది బ్రెత్ అనలైజర్లు, బాడీ వార్న్ కెమెరాలతో విధుల్లో ఉంటారు. డిసెంబర్ 31 రాత్రి కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్ కట్ట, తీగల వంతెన పైకి వెళ్లడం, అక్కడ వేడుకలు నిర్వహించడం పూర్తిగా నిషేధించారు. ఈ ప్రాంతాల్లో నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ కొనసాగుతుంది. వేడుకల్లో డీజేల వినియోగంపై పూర్తి నిషేధం ఉంది. ధ్వని కాలుష్యానికి సంబంధించి ఫిర్యాదులు అందితే బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం. బాధితులు వెంటనే డయల్ 100కు సమాచారం అందించవచ్చు. బహిరంగ ప్రదేశాల్లో టపాసులు పేల్చడం నిషిద్ధం. ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 188 ఐపీసీ ప్రకారం కేసులు నమోదు చేస్తాం. నగర శివార్లలోని గెస్ట్ హౌస్‌లు, ఫాంహౌస్‌లపై ప్రత్యేక నిఘా ఉంచాం. డ్రగ్స్ వాడకాన్ని గుర్తించేందుకు నార్కో టీమ్స్, శిక్షణ పొందిన జాగిలాలు, డ్రగ్ డిటెక్ట్ కిట్లను ఉపయోగిస్తామని, పట్టుబడిన వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన కేసులు నమోదు చేస్తామన్నారు. వేడుకల సమయంలో మహిళలను వేధించే ఆకతాయిల ఆట కట్టించేందుకు షీ టీమ్స్ నిరంతరం పర్యవేక్షిస్తాయని, ముఖ్య ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్ మరియు పికెట్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలీసులకు సహకరించి, ప్రశాంతమైన వాతావరణంలో కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలని అని సీపీ గౌస్ ఆలం కోరారు.

మెదక్ లో ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 28: దేశానికి స్వతంత్రం తీసుకువచ్చి దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పరచడంలో కాంగ్రెస్ పార్టీ కీలకపాత్ర వహించి దని కాంగ్రెస్ పార్టీ అంటే బడుగు బలహీన వర్గాల పార్టీ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ జెండా ను జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి ఇప్పటి వరకు ప్రజల సంరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో నెహ్రూ కుటుంబం దేశం కోసం త్యాగం చేసిన పార్టీ అని ఈ దేశం కోసం ఇందిరా గాంధీ రాజీవ్ గాంధీ ఇలాంటి ప్రధాన మంత్రులు చనిపోవడం జరిగిందని వారు గుర్తు చేశారు దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రజల హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కి ప్రజల్లో విశ్వాసం ఉందని, అదే పార్టీ అసలైన బలమని అన్నారు. అదే శక్తితో దేశం, రాష్ట్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ రాష్ట్రానికి చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను ప్రతి గడపగడపకు చేరేలా ప్రతి ఒక్కరం కృషి చేయాలని ఈ సంక్షేమ పథకాలు ప్రజలకు అర్థమయ్యే విదేలా వివరించాలని వారు కోరారు ఈ ఆవిర్భావ దినోత్సవం పార్టీ శ్రేణులు మరింత ఐక్యతతో ఉంటూ ప్రజాసేవ లో ముందుకు సాగాలని అన్నారు. ప్రతి ఒక్కరు పార్టీ ఆదేశాలకు కట్టుబడుతూ, కాంగ్రెస్ సిద్ధాంతాలు గ్రామ స్థాయి వరకు బలంగా చేరేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్లు సురేందర్ గౌడ్. చంద్రపాల్. చౌదరి సుప్రభాత రావు. ఆంజనేయులు గౌడ్. మహిపాల్ రెడ్డి దాయర. లింగం ముత్యం గౌడ్. లక్ష్మీనారాయణ గౌడ్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు పరశురామ్ గౌడ్. కాంగ్రెస్ పార్టీ సర్పంచులు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

జనగామలో బీఆర్ఎస్‌ను ఓడించే సత్తా కాంగ్రెస్‌కు లేదు

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, జనగామ, డిసెంబర్ 28: జనగామ నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీని ఓడించే సత్తా కాంగ్రెస్ పార్టీకి లేదని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జనగామ సర్పంచుల సమావేశం అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలోని మెజారిటీ గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ మద్దతు పొందిన అభ్యర్థులు ఘన విజయం సాధించారని తెలిపారు. అన్ని మండలాల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బీఆర్ఎస్ నుంచే ఎన్నికయ్యారని పేర్కొన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ నాయకులు ఈ ఫోరం తమదేనని చెప్పుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు. జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, నాయకత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారే కాంగ్రెస్ పార్టీ కంటే ఇతర పార్టీలే ఎక్కువ స్థానాలు గెలుచుకున్నాయని, కేవలం ఆరు నియోజకవర్గాల్లో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించిందని, అందులో జనగామ ఒకటని వెల్లడించిన విషయాన్ని ఎమ్మెల్యే పల్లా గుర్తు చేశారు. సర్పంచ్ ఎన్నికల వివరాలను వెల్లడిస్తూ నర్మెట్ట మండలంలో 17 గ్రామ పంచాయతీలకు గాను 10, తరిగొప్పుల మండలంలో 15కి 6, జనగామ మండలంలో 21కి 11, కొమరవెల్లి మండలంలో 11కి 7, మద్దూర్ మండలంలో 11కి 7, దులిమిట్ట మండలంలో 11కి 7 గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ మద్దతు పొందిన అభ్యర్థులు అత్యధిక మెజారిటీలతో విజయం సాధించారని తెలిపారు. మొత్తం 73 గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారని అన్నారు. జనగామ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తన సొంత గ్రామంలో కూడా సర్పంచ్‌ను గెలిపించుకోలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పార్టీ తన సత్తాను చాటుతుందని ఎమ్మెల్యే పల్లా ధీమా వ్యక్తం చేశారు.

“

జవహర్‌లాల్ నెహ్రూకు సంబంధించిన కీలక లేఖలు, పత్రాలు దేశ వారసత్వ సంపద. వీటిని వెంటనే 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీ'కి తిరిగి సోనియా గాంధీ అప్పగించాలి. అవి కుటుంబ ఆస్తి కాదు. దేశ చరిత్రను తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది. 2008లో దాదాపు 26,000 పత్రాలను తీసుకెళ్లారు. గతంలో పలుమార్లు కోరినా తిరిగి ఇవ్వలేదు.
- కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

ప్రాంతీయం

ముక్కోటికి ముస్తాబైన వేంకటేశ్వరాలయం

• ఉత్తర వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 28: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోహినీపురలో ఉన్న శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర వైకుంఠ ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించగా, వెలుగుల్లో ఆలయం దేదీప్యమానంగా భక్తులను ఆకర్షిస్తోంది. డిసెంబర్ 30, మంగళవారం ఉదయం 4 గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుంది. ఆ రోజున స్వామివారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. పట్టణంతో పాటు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో క్యూలైన్లు, తాగునీరు, ప్రసాద పంపిణీ వంటి ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసోత్సవాలు డిసెంబర్ 16 నుంచి జనవరి 16 వరకు వైభవంగా కొనసాగనున్నట్లు ఆలయ అధికారులు , అర్చకులు తెలిపారు. ఈ కాలంలో ప్రతిరోజూ తిరుప్పావై సేవ, ప్రాతఃకాల ఆరాధన, పాశురానుసంధానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముక్కోటి ఏకాదశి రోజున భక్తి సంగీత విభావరి కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్తర వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని స్వామివారి కృపకు పాత్రులవ్వాలని దేవస్థాన నిర్వాహకులు కోరారు.

అశేష జనవాహిని మధ్య మాజీ సైనికుడు సంజీవ్ అంత్యక్రియలు

• కన్నీరు మున్నీరైన కొత్తపల్లి గ్రామం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, డిసెంబర్ 28: మాగనూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దేశ సేవకై ప్రాణాలర్పించేందుకు వెనకాడని ఒక సైనికుడు రోడ్డు ప్రమాద రూపంలో అకాల మరణం చెందడం ఆ ప్రాంత ప్రజలను, ముఖ్యంగా యువతను కలచివేసింది. కొత్తపల్లి గ్రామానికి చెందిన తాయికోటి అనంతమ్మ, మారెప్పల మూడవ సంతానమైన తాయికోటి సంజీవ్ (41), దళిత కుటుంబంలో పుట్టి బాల్యం నుండి ఎన్నో కష్టాలను అనుభవించారు. పేదరికాన్ని అధిగమిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసాన్ని పూర్తి చేసిన ఆయన తన పట్టుదలతో భారత సైన్యంలో చేరి దేశానికి సేవలందించారు. కొంతకాలం క్రితం వ్యక్తిగత కారణాలతో తన ఉద్యోగానికి రాజీనామా చేసిన సంజీవ్ 2020 లో స్కాలర్స్ డిఫెన్స్ అకాడమీ ఏర్పాటు చేసి యువతకు ఉచిత ఆర్మీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి ఎందరో యువకులను దేశ సేవ వైపు ఆసక్తి కలిగేలా చేసిన సంజీవ్ ఈనెల 22న సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మక్తల్ చందాపూర్ సమీపంలో టిప్పర్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ మృత్యువుతో పోరాడుతూ శనివారం ఆయన తుదిశ్వాస విడిచారు. ఆదివారం మక్తల్‌లో పోస్టుమార్టం పూర్తయ్యాక సంజీవ్ పార్థివ దేహాన్ని స్వగ్రామం కొత్తపల్లికి తీసుకువస్తుండగా నియోజకవర్గంలోని ప్రజలు, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దారిపొడవునా వందలాది బైక్‌లు, వాహనాలతో యువత నివాళులర్పిస్తూ పార్థివ దేహాన్ని అనుసరించారు. సంజీవ్ మరణ వార్తతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, సాయంత్రం 5 గంటల సమయంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కన్నీటి వీడ్కోలు మధ్య అంత్యక్రియలు ముగిశాయి.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 28: దుబ్బాక పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ దేవాలయంలో ఈనెల 30న జరగనున్న వైకుంఠ ఏకాదశి సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్ల ను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరిశీలించి సంబంధిత అధికారులతో కలిసి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజున భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశమున్నందున భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని, పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖ మరియు ఆరోగ్య శాఖ అధికారులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా ట్రాఫిక్ ఆంక్షలు, వాహనాల పార్కింగ్, రాకపోకల నియంత్రణ విషయాల్లో ముందస్తు ప్రణాళికతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక సీఐ పి. శ్రీనివాస్, ఎస్ఐ కీర్తి రాజు, మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్‌కుమార్, దేవాలయ కమిటీ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

ప్రతిపక్షం,మెదక్ టౌన్, డిసెంబర్ 28: మెదక్ జిల్లా హవెలిఘనపూర్ మండలం జక్కన్నపేటలో ప్రమాదవశాత్తు చాపల కిష్టయ్య నివాస పూరి గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటనలో ఇంట్లోని వస్తువులను కాలి బూడిదైన విషయం తెలుసుకున్న ఇండియన్ ఫౌండేషన్ సభ్యులు రాగి. వనజ,గౌరీ సంతోష్, మౌనిక,సుమన,స్థానిక సర్పంచ్ చామంతుల. సత్యనారాయణతో కలిసి ఆదివారం బాధిత కుటుంబానికి నిత్యవసర వంట సామాగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి భరోసా ఇచ్చారు.

సర్పంచుల ఫోరం కార్యవర్గాన్ని అభినందించిన గజ్వేల్ బీఆర్ఎస్ ఇంచార్జ్

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 28: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నాడు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో జగదేవపూర్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షునిగా పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా ఆలేటి కవితలోలాకర్ రెడ్డి, పోసానిపల్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా చెక్కల పరమేశ్వర్, కార్యదర్శులుగా జురు స్రవంతి వెంకటేశం, రజిత మల్లేశం, క్యాషియర్ గా కనకయ్య సలహాదారుగా రజిత పరశురాం, ప్రచార కార్యదర్శి గా క్యాసారం కుమార్,కార్యవర్గ సభ్యులుగా బత్తిని రాజు గౌడ్, దిన రాజలింగం, మౌనిక ముత్యం, రజిత అశోక్, జ్యోతి మహేష్, సంధ్య శ్రీనివాస్ లను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి వారికి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతూ రాబోయే రోజుల్లో పార్టీకి పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేస్తూ గ్రామ ప్రజల మన్నన లను పొందాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభించిన నూతన పాలకవర్గం

ప్రతిపక్షం, మిడిదొడ్డి, డిసెంబర్ 28: రోడ్డు గుంతలమయంగా మారి ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు ఉపశమనం లభించింది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామం నుండి బీరప్ప రోడ్డు మీదుగా మిరుదొడ్డి ప్రధాన రహదారిని కలిపే మట్టి రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే విషయాన్ని గ్రామస్తులు నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, పాలకవర్గం సభ్యుల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ గ్రామ యువజన నాయకుడు రంగనబోయిన యాదగిరి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాల్ రాజు, వార్డు సభ్యులు గోపాల్ ,అనిల్, గ్రామస్తులు బాల్ రెడ్డి, శ్రీనివాస్, పరశురాములు, రవి, నరసింహారెడ్డి, లింగం, యాదగిరి, నర్సింలు, కృష్ణ పలువురు పాల్గొన్నారు.

విధులకు డ్రైవర్ గైర్హాజరు.. చెత్తను సేకరించిన సర్పంచ్

• బొప్పాపూర్‌లో స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ఇంటింటికి

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 28: డ్రైవర్ విధులకు గైర్హాజరు కావడంతో స్వయంగా ఆ గ్రామ సర్పంచ్ ట్రాక్టర్ నడుపుతూ గ్రామ పురవీధుల గుండా సపాయి కార్మికులతో కలిసి చెత్తను సేకరించడం పట్ల ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ మాదవనేని భాను ప్రసాద్ మాట్లాడుతూ బొప్పాపూర్ గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత, ప్రజలకు మాటల్లోనే కాదు చేతల్లోనూ సేవ చేయాలనే సంకల్పంతో, నేనే స్వయంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను నడిపి ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించానన్నారు. స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదు... అది ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. నాయకుడు ముందు నడిచినప్పుడే ప్రజల్లో మార్పు వస్తుందన్న నమ్మకంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది , వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

• పూజాల హరికృష్ణ

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 28: రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజాల హరికృష్ణ స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్యకర్తలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూజాల హరికృష్ణ మాట్లాడుతూ, బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం, అలాగే ఆంధ్ర పాలన నుంచి తెలంగాణ విముక్తి రెండూ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమయ్యాయని అన్నారు. ఇందిరాగాంధీ పాలనలో ప్రతి ఇంటా కాంగ్రెస్ జెండా ఎగురుతుండేదని, నేటికీ గ్రామ స్థాయి నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ అభివృద్ధి పథకాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. గత పదేళ్ల కుటుంబ పాలన నుంచి రాష్ట్రం విముక్తి పొందిందని, ప్రజా పాలన ఏర్పడటంతో ప్రజల ముఖాల్లో ఆనందం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వచ్చినట్లుగా ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, దాస అంజన్న, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, పూజాల గోపీకృష్ణ, కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్ర మహేందర్, రాజబహాదూర్ రెడ్డి, టీఎంపీస్ అధ్యక్షుడు చెంది శ్రీనివాస్ ముదిరాజ్, అంబటి మహేష్‌గౌడ్, కృష్ణ పటేల్, వాహబ్, రషద్, కెమ్మసారం రాజేష్ ఖన్నా, దేశెట్టి నరేష్, ఎర్ర బోలు రాజిరెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు అజమాత్, చోట అజమాత్, ఉప్పెరెట్ల సంతోష్, జనార్దన్ రెడ్డి, నవీన్ ముదిరాజ్, వంశీ, ప్రవీణ్, రజని, సనా తదితరులు పాల్గొన్నారు.

జనవరిలోగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

• పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, డిసెంబర్ 28: జనవరిలో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించకుంటే ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి నాయకత్వంలో పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేటలో పీఆర్టీయూ భవన్ లో ఆదివారం పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంగ మహేందర్ రెడ్డి పీఆర్టీయూటీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లుగారి ఇంద్రసేనా రెడ్డి, ఆదరాసుపల్లి శశిధర శర్మతో కలిసి పీఆర్టీయూటీఎస్ 2026 క్యాలెండర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వెంటనే పీ ఆర్ సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీ ఏ లు మంజూరు చేయడంతో పాటు, బకాయి బిల్లులు పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జనవరిలో సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమ కార్యాచరణ తప్పదని తెలిపారు. ఇందుకోసం ఉపాధ్యాయులుగా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పత్రికా సంపాదక వర్గ సభ్యులు పిన్నింటి రామకృష్ణా రెడ్డి, లక్కిరెడ్డి విజయ, సోషల్ మీడియా సిద్ధిపేట కన్వీనర్ నీరడి లక్ష్మీ నారాయణ, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రామి రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రవీందర్ రెడ్డి పార్థసారథి, శ్రీనివాస రెడ్డి, వెంకటేశ్, రాజిరెడ్డి, వెంకట నర్సారెడ్డి, శ్రీనివాస గౌడ్, కనకా రెడ్డి, పద్మ, రాజశేఖర్, మహాదేవ్, రామస్వామి, వెంకట రమణ, రాజు, శ్రీశైలం, సురేందర్ రెడ్డి, కేవీఎన్ రెడ్డి, నర్సింహా రెడ్డి, రాష్ట్ర బాధ్యులు హనుమా రెడ్డి, పన్యాల శ్రీనివాస రెడ్డి, నిమ్మ శ్రీనివాస రెడ్డి,నీలం శ్రీనివాస్, వేమా రెడ్డి, రాజేశ్వర్ రావు, మధుసూదన్ రెడ్డి, పూర్ణ చందర్, నర్సింహారెడ్డి, నాజీమ్ బాబా, మల్లారెడ్డి, నాగరాజు, వెంకటేశ్, నర్సింహా రెడ్డి, జనార్దన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయలలో భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన అదనపు ఎస్పీ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 28: ఏడుపాయల వన దుర్గామాత ఆలయంలో ప్రతి ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, ఆలయ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ఆదివారం పరిశీలించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే రోజుల్లో ప్రత్యేకంగా క్విక్ రెస్పాన్స్ టీమ్ బందోబస్తును ఏర్పాటు చేస్తూ, జిల్లా పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు నీటి లోతు, ప్రవాహ తీవ్రత తెలియక ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉండటంతో, సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించడం వల్ల ఇటీవల అనేక ప్రమాదాలను నివారించగలిగామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలు, డ్యామ్ సమీపంలోని నీటి ప్రవాహ పరిస్థితులు, భక్తుల రాకపోకలను పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు.అధిక రద్దీ రోజుల్లో భక్తుల భద్రతకు ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి ఒక్కరు సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.అనంతరం వనదుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అదనపు ఎస్పీకి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

30న ముదిరాజ్ సర్పంచ్ లకు సన్మానం

ప్రతిపక్షం, చేగుంట, డిసెంబర్ 28: ఈనెల 30వ తేదీన హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ సర్పంచ్ లకు సన్మాన కార్యక్రమం చేపట్టినట్లు ముదిరాజ్ మహాసభ మెదక్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి తలారి బిక్షపతి ముదిరాజ్ తెలిపారు. ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచులను వార్డు సభ్యులను ఈ సందర్భంగా సన్మానిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ హాజరుకావాలని ఆహ్వాన పత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ముదిరాజ్ యువత నాయకులు అల్లుడు జగన్ ముదిరాజ్ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు వివిధ జిల్లాల ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

“



ఎన్నిగంటలు పని చేశామనే దానికంటే ఎంత శ్రద్ధగా పనిచేశామనేది ముఖ్యం. పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌కు టైమ్ కేటాయించేందుకు ప్రతి ఒక్కరికీ ఛాన్స్ ఉంటుంది. కేటాయించిన టైమ్‌లో 100% ఫోకస్డ్‌గా ఉండాలి. సమయపాలనలో ఎవరి పర్సనల్ ఇంట్రెస్ట్‌లు వారికి ఉంటాయి.

- ఇన్ఫోసిస్ కో-ఫౌండర్ ఎస్‌డీ శిబులాల్

త్వరలోనే 'మలేరియా'ను పూర్తిగా తరిమేస్తాం

- హోంమంత్రి అమిత్ షా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, అహ్మదాబాద్, డిసెంబర్ 28: భారత్ నుంచి మలేరియాను త్వరలోనే పూర్తిగా తొలగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. నేడు అహ్మదాబాద్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్వహించిన ఆలిండియా మెడికల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు. భారత్‌లో మలేరియా కేసులు 97 శాతం తగ్గాయని, అతి త్వరలో దేశం నుంచి పూర్తిగా మలేరియాను తరిమేస్తామని అన్నారు. ఆయుష్మాన్ భారత్, మిషన్ ఇంద్రధనుష్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన చెప్పారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించాలంటే ఆరోగ్యవంతమైన ప్రజలు అవసరమని, అందుకు డాక్టర్లు.. ప్రభుత్వ పథకాల లక్ష్యం నెరవేరేలా కలిసి పనిచేయాలని కోరారు. భారత్ ఆరోగ్య రంగంలో తీసుకుంటున్న చర్యలు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. దేశంలో గడిచిన ఐదేళ్లలోనే డెంగ్యూ మరణాల రేటును 1 శాతం, ప్రసూతి మరణాల సంఖ్య 25 శాతం తగ్గిందని షా వెల్లడించారు. 2014లో రూ.37 వేల కోట్లుగా ఉన్న కేంద్ర ఆరోగ్య బడ్జెట్ ఇప్పుడు రూ.1.28 లక్షల కోట్లకు పెరగడమే ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు.



విశ్వ వీక్షణం

జలాంతర్గామిలో ప్రయాణించిన రాష్ట్రపతి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్28: త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము జలాంతర్గామిలో ప్రయాణించారు. కర్ణాటకలోని కార్వార్ నౌకాదళ స్థావరం నుంచి కల్వరి శ్రేణి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో బయలుదేరారు. రాష్ట్రపతి వెంట నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి ఉన్నారు. కల్వరి క్లాస్ జలాంతర్గామిలో రాష్ట్రపతి ముర్ము ప్రయాణించడం ఇదే తొలిసారి. గతంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కల్వరి శ్రేణి సబ్‌మెరైన్‌లో ప్రయాణించారు. ఆ తర్వాత సబ్‌మెరైన్‌లో ప్రయాణిస్తున్న రెండో రాష్ట్రపతిగా ముర్ము గుర్తింపు పొందారు.

బహిస్టు సమయంలో అధిక రక్తస్రావం, పొత్తి కడుపులో నొప్పి, నడుం నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే.. ఇలాంటి సమయంలో ఈ లక్షణాలు మామూలే కదా.. అనుకుంటారు. కానీ ఒక్కోసారి గర్భాశయంలో కణుతులు ఏర్పడటానికి ఇది సంకేతం. గర్భాశయంలో ఏర్పడే కణుతులను యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ అంటారు. ఇవి గర్భాశయంలో ఒకటిగా లేదా చిన్న చిన్న నీటితిత్తులుగా కొన్ని సెంటీమీటర్ల వరకు పెరిగే అవకాశం ఉంటుంది. గర్భం ధరించే వయసు వచ్చాక తలెత్తే ఈ సమస్యతో మన దేశంలో సుమారు 25 – 50 శాతం మంది మహిళలు బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇవి సంతానలేమితో పాటు ఇతర అనారోగ్యాలకు దారితీస్తాయని చెబుతున్నారు నిపుణులు. అసలు ఫైబ్రాయిడ్లు ఎందుకొస్తాయి? వాటి వల్ల కలిగే నష్టాలేంటి? వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

నేటి కాలంలో సంతానలేమితో బాధపడే మహిళల సంఖ్య పెరిగింది. ఇందుకు గర్భాశయంలో ఏర్పడే ఫైబ్రాయిడ్లు కూడా ఒక కారణం. గర్భం ధరించే వయస్సు వచ్చాక, గర్భాశయంలో ఫైబ్రాయిడ్లు చిన్న గడ్డల్లా ఏర్పడి వీటి పరిమాణం క్రమంగా పెరుగుతుంది. వీటి ఉనికి, పరిమాణరీత్యా మూడు రకాలుగా విభజించవచ్చు.

1) సబ్‌సీరోజల్ ఫైబ్రాయిడ్స్
2) ఇంట్రామ్యూరల్ ఫైబ్రాయిడ్స్
3) మ్యూకోజల్ ఫైబ్రాయిడ్స్.

యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ చికిత్స సులువే!

కారణాలు

ఇవి ఏ కారణం చేత ఏర్పడతాయనే విషయం పట్ల స్పష్టత లేదు. శరీరంలో జరిగే కొన్ని మార్పులు ఇందుకు దోహదం చేస్తాయి.

- అండాశయాలు ఉత్పత్తి చేసే ఈస్ట్రోజెన్, ప్రోజెస్టెరాన్ వంటి ప్రత్యుత్పత్తి హార్మోన్ల స్థాయిల్లో అసమతుల్యత తలెత్తినప్పుడు ఫైబ్రాయిడ్లు ఏర్పడుతాయి.
- రుతుచక్ర సమయంలో, గర్భధారణ సమయంలో ఇవి ఎక్కువగా ఏర్పడతాయి.
- గర్భం ధరించిన సమయంలో ప్రత్యుత్పత్తి హార్మోన్లు అధికంగా విడుదల అవుతాయి. ఈ పరిస్థితి కూడా ఫైబ్రాయిడ్ల సమస్యకు దారితీస్తుంది.
- నెలసరి ఆగిపోయిన స్త్రీలలో హార్మోన్ల ఉత్పాదన చాలావరకు తగ్గడంతో పాటు ఫైబ్రాయిడ్స్ ఏర్పడే అవకాశం తక్కువగా ఉంటుంది.
- స్థూలకాయం, వంశపారంపర్యత వంటి అంశాల వల్ల కూడా గర్భాశయ కణుతులు ఏర్పడతాయి.
- పోషకాహారలోపం, చిన్న వయసులోనే రజస్వల అవడం, మానసిక ఒత్తిళ్లు.. వంటివి కూడా ఈ సమస్య తలెత్తడానికి కారణం అవుతాయి.

లక్షణాలు

- అధిక రుతుస్రావం..
- రెండు రుతుచక్రాల మధ్య వ్యవధి ఎక్కువ రోజులు కొనసాగడం..
- పొత్తికడుపులో నొప్పి..
- నడుము నొప్పి..
- ఫైబ్రాయిడ్స్ వల్ల మూత్రాశయంపై ఒత్తిడి పడినట్లే తరచూ మూత్రానికి వెళ్లాలని అనిపిస్తూ ఉండటం..
- పేగులపై ఒత్తిడి పడితే మలబద్ధకం, కడుపుబ్బరం వంటి లక్షణాలను గమనించవచ్చు..
- కలయిక సమయంలో నొప్పిగా ఉంటుంది.

పరీక్షలు

అల్ట్రాసౌండ్, పెల్విక్, ఎంఆర్ఐ.. వంటి పరీక్షల ఆధారంగా ఫైబ్రాయిడ్ల సైజు, అవి గర్భాశయంలో ఎక్కడ ఉన్నాయో గుర్తించడం ద్వారా తగిన చికిత్సను అందించవచ్చు. అలాగే మెనోపాజ్ దశకు చేరువయ్యే సమయంలో ప్రత్యుత్పత్తి హార్మోన్ల విడుదల క్రమంగా తగ్గడం వల్ల ఫైబ్రాయిడ్ల పరిమాణం కూడా క్రమంగా తగ్గుతుంది.

చికిత్స

ఫైబ్రాయిడ్స్ వచ్చాక తగ్గించుకోవడం కంటే రాకుండా ముందే జాగ్రతపడితే మంచిది. అలాగే ఫైబ్రాయిడ్స్ రాకుండా ముందు నుంచీ కొన్ని జాగ్రత్తలు పాటించడం ముఖ్యం.

- బరువు పెరిగే కొద్దీ ఫైబ్రాయిడ్ల సమస్య తలెత్తే ప్రమాదం పది రెట్లు పెరుగుతుంది. కాబట్టి బరువును అదుపులో ఉంచుకోవడానికి యోగా, వ్యాయామం వంటివి క్రమం తప్పకుండా సాధన చేయాలి.
- గర్భిణిగా ఉన్న సమయంలో హార్మోన్ల ప్రభావం కారణంగా ఫైబ్రాయిడ్ల సమస్య ఎక్కువగా కనిపించినప్పటికీ.. చాలా కేసుల్లో వీటివల్ల గర్భిణికి, కడుపులో పెరుగుతున్న పిండానికి ఎలాంటి హాని ఉండదు.
- జెనెటిక్ కాన్‌స్టిట్యూషన్ పద్ధతి ద్వారా యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ సమస్యను సంపూర్ణంగా నయం చేయవచ్చు. ఈ చికిత్స ద్వారా గర్భాశయపు కణుతులను పూర్తిగా తొలగించడమే గాకుండా, శరీరంలోని హార్మోన్లను అసమతౌల్యతను సరిచేయడం వల్ల సమస్యను తేలిగ్గా పరిష్కరించవచ్చు.

ఈ మార్పులు అవసరం!

జీవనశైలిలో, ఆహారపరంగా మార్పులు రావడానికి సాధారణంగా మనం ఇష్టపడం. అలాకాకుండా కొన్ని చిన్న చిన్న మార్పులు చేసుకుంటే.. మహిళలకు మెనోపాజ్ దశ దాటాక ఎదురయ్యే చాలా రకాల సమస్యల్ని అదుపులో ఉంచుకోవచ్చు. మరి అవేంటో చూద్దామా..

- ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో ఇనుము కూడా తప్పనిసరే.. ఈ శాతం తగ్గితే హృద్రోగాలు వచ్చే అవకాశం అధికం. ఆకుకూరలు, చేపలు, మాంసాహారం, పాల ఉత్పత్తులు, గుమ్మడి గింజలు వంటి వాటిలో ఇనుము శాతం అధికంగా ఉంటుంది. కాబట్టి ఈ ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల శరీరంలో ఇనుము శాతం ఎక్కువై రక్త ప్రవాహంలో ఎటువంటి సమస్యలూ లేకుండా గుండె పదిలంగా ఉంటుంది.
- ఆహారంలో ఉప్పు శాతాన్ని తగ్గించుకోవాలి. లేదంటే అధిక రక్తపోటు సమస్య పెరుగుతుంది. ఇది కూడా గుండె అనారోగ్యానికి, ఇతర సమస్యలకు కారణమవుతుంది.
- ప్రతిరోజూ పీచు ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవాలి. పండ్లు, తాజా కూరగాయల్లో పీచు అధికంగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా ఉండటమే కాకుండా, శరీరంలోని మలినాలు ఎప్పటికప్పుడు బయటకు వస్తాయి. త్వరగా ఆకలి కూడా వేయదు.
- వయసు కాస్త మీద పడేటప్పటికి ఎముకలు బలహీనపడటం మామూలే.. అలా జరగకుండా ఉండాలంటే ఆహారం ద్వారా కాల్షియం అందేలా చూసుకోవాలి. ఆకుకూరలు, బెండకాయ, చిక్కుడు, బీన్స్, చిలగడదుంప వంటి కూరగాయలతో పాటు నారింజ, జామ, బొప్పాయి వంటి పండ్లను కూడా తీసుకుంటే విటమిన్ డి అందుతుంది. అలాగే చేప, చీజ్, గుడ్డు, నారింజ పండు వంటి వాటి నుండి కూడా ఈ పోషకం అందుతుంది.
- వీలైనంతవరకు వ్యాయామం చేయాలి. ముఖ్యంగా ప్రతిరోజూ నడిచేలా చేయడం, జీవనశైలిలో ప్రాథమికంగా చేసుకోవాల్సిన మార్పు. అలాగే అవకాశం ఉన్నప్పుడల్లా మెట్లు ఎక్కి దిగాలి. కాళ్లలోని కండరాలు దృఢంగా మారి శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది.
- ఎక్కువసేపు ఒకేచోట కూడా కూర్చుని ఉండకూడదు. అరగంటకోసారైనా అటూ ఇటూ కదులుతూ ఉండాలి.
- వీలైతే వ్యాయామాన్ని కూడా దినచర్యలో భాగంగా చేసుకోవాలి. యోగా, జిమ్ ఏదైనా కావచ్చు. దానివల్ల బరువు అదుపులో ఉండటమే కాదు, మానసిక ప్రశాంతత కూడా సొంతమవుతుంది.
- ధ్యానం చేయడం వల్ల ఒత్తిడి దరిచేరదు. నేటి ఉద్యోగాల వల్ల ఒత్తిడి కలగడం సహజం. దినచర్యలో ధ్యానాన్ని జత చేసుకుంటే అనారోగ్యం దరిచేరదు. ఒత్తిడి కూడా తగ్గిపోతుంది. కనీసం పదినిముషాలు ధ్యానం చేసినా మంచిదే.

జమ్మూలో 30 మంది ఉగ్రవాదులు

- అప్రమత్తమైన భద్రతా బలగాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, జమ్మూ, డిసెంబర్ 28: జమ్మూ ఏరియాలో 30 మందికి పైగా పాకిస్థానీ ఉగ్రవాదులు తలదాచుకున్నట్టు నిఘా వర్గాలు వెల్లడించాయి. దాంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉగ్ర స్థావరాలు గుర్తించడానికి కొండలు, అడవులు, మారుమూల లోయల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులను ట్రాక్ చేయడానికి డ్రోన్లు, థర్మల్ ఇమేజర్లు, గ్రౌండ్ సెన్సార్లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. జమ్మూలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో ఉగ్రవాదులపై నిరంతర నిఘా కోసం పర్వత ప్రాంతాల్లో తాత్కాలిక నిఘా స్థావరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు జమ్మూ కశ్మీర్‌లో మంచు కురుస్తుండటంతో చొరబాట్లకు ఇదే అదునుగా భావించిన ఉగ్రమూకలు అంతర్జాతీయ సరిహద్దును దాటుకుని దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ విషయాన్ని సరిహద్దు భద్రతా దళం అధికారులు వెల్లడించారు. అయితే ఉగ్రవాదుల చొరబాటు యత్నాలను తమ దళాలు తిప్పికొడుతున్నాయని అన్నారు. సరిహద్దుల్లో ఉగ్ర కదలికల నేపథ్యంలో కశ్మీర్‌లోని గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించినట్లు తెలిపారు.

ఆ వేళ నన్ను తలదాచుకోమన్నారు

- పాకిస్తాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ

ఇస్లామాబాద్, డిసెంబర్ 28: 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను భారత సైన్యం నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న దాయాది దేశాన్ని కాళ్లబేరానికి వచ్చేలా చేసిన ఈ ఆపరేషన్ ప్రభుత్వ పెద్దల గుండెల్లో గుబులు రేపింది. భారత సైన్యం క్షిపణులతో విరుచుకుపడిన ఆ రోజులపై పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ తాజాగా స్పందించారు. ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రాణాలు కాపాడుకునేందుకు తనను బంకర్లో దాక్కోవాలని అధికారులు సూచించారని ఆయన వెల్లడించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడితో రగిలిపోయిన భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌పై కన్నెర్రజేసింది. మే 7వ తెల్లవారు జామునే క్షిపణుల దాడులతో ఆ దేశంలోని ఉగ్రస్థావరాలనే తునాతునకలు చేసింది. ఈ సందర్భంగా పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీని బంకర్లోకి వెళ్లాలని సైనిక అధికారులు సూచించారట. ఈ విషయాన్ని జర్దారీనే స్వయంగా తెలిపారు. ఆదివారం ఒక సభలో మాట్లాడుతూ.. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో మా సైన్యం బంకర్‌లో దాక్కుంది. నా భద్రతాధికారి నా వద్దకు వచ్చి "సార్ యుద్ధం మొదలైంది. మనం బంకర్లోకి వెళ్లుదాం" అని చెప్పారు. అయితే.. నేను ఆయన సలహాను తిరస్కరించాను. భారత్ నుంచి ప్రతిచర్య ఉంటుందని నేను ముందుగానే ఊహించాను. కానీ, బంకర్‌లో తలదాచుకునేందుకు మాత్రం అంగీకరించలేదు' అని పాక్ అధ్యక్షుడు పేర్కొన్నారు.

పుణె ఎన్నికల్లో గ్యాంగ్‌స్టర్ పోటీ

- చేతులను కట్టేసి..ముసుగుతో నామినేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, పుణె, డిసెంబర్ 28: సొంత మనవడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఓ గ్యాంగ్‌స్టర్ పుణె లోకల్ బాడీ ఎన్నికలలో పోటీ పడుతున్నాడు. శనివారం అతడు జైలు నుంచి రిటర్నింగ్ కార్యాలయానికి వచ్చి నామినేషన్ దాఖలు చేశాడు. ముఖానికి నల్లటి ముసుగు కట్టి, చేతులను తాళ్లతో కట్టేసి పోలీసులు అతడిని రిటర్నింగ్ ఆఫీస్‌కు తీసుకొచ్చారు. అందుకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సొంత మనవడు ఆయుష్ కొమ్కర్ హత్య కేసులో గ్యాంగ్ లీడర్ బందు అందేఖర్ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అతడికి ప్రత్యేక కోర్టు అనుమతిచ్చింది. దాంతో అతడు ఇండిపెండెంట్‌గా బరిలో దిగాడు. నామినేషన్ వేసేందుకు వస్తూ నినాదాలు చేశాడు. ఇదే హత్య కేసులో నిందితులుగా ఉన్న అందేఖర్ కుటుంబంలోని మరో ఇద్దరు మహిళలు కూడా ఎన్నికల్లో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. కోర్టు అనుమతి ఆ ఇద్దరు మహిళలు కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఆయుష్ కొమ్కర్ సెప్టెంబర్ 5న నానాపేటలో జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయాడు. అందేఖర్ ఆయన కుటుంబంలోని ఇద్దరు మహిళలతోపాటు మరో 15 మందికి ఈ హత్యలో ప్రమేయం ఉందనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం వీరంతా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. పుణెతో సహా మరో 28 ప్రాంతాల్లో జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి.

ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

నాలుగో టీ20లోనూ మనదే గెలుపు

శ్రీలంకపై విజయం సాధించిన వుమెనిండియా

శ్రీలంకతో నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో వుమెనిండియా దుమ్మురేపింది. మూడో మ్యాచ్‌లో గెలుపుతో సిరీస్ కైవసం చేసుకున్న భారత మహిళా జట్టు నాలుగో టీ20 మ్యాచ్‌ని కూడా తన ఖాతాలోనే వేసుకుని సత్తా చాటింది. 222 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకను 191 పరుగులకే పరిమితం చేస్తూ సిరీస్‌ను 40తో క్లీన్ స్వీప్ చేసింది. శ్రీలంక ప్లేయర్లు హాసిని పెరీరా (33), చమి ఆటపట్టు (52) తొలి వికెట్‌కు హాఫ్ సెంచరీ భాగస్వామ్యం చేశారు. తర్వాత దులానితో కలిసి ఆటపట్టు ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించినా లాభం లేకుండా పోయింది. భారత బౌలర్లలో అరుంధతి, వైష్ణవి శర్మ చెరో రెండు వికెట్లు తీసి శ్రీలంక పరుగులకు అడ్డుకట్ట వేశారు. అంతకు ముందు బ్యాటింగ్‌చేసిన టీమిండియాకు ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలీ శర్మ శ్రీలంక బౌలర్లపై విరుచుకుపడ్డారు. తొలివికెట్‌కు వారిరువురు 162 పరుగులు జోడించారు. ఈ మ్యాచ్‌లో స్మృతి అత్యంత దూకుడుగా ఆడుతూ 48 బంతుల్లో 80 రన్స్ చేసింది. మహిళల క్రికెట్‌లో 10వేల పరుగుల మైలురాయిని చేరుకుంది. షెఫాలీ వరుసగా మూడో హాఫ్ సెంచరీ సాధించింది. రిచా ఘోష్ (40/16) దూకుడా ఆడగా, హర్మన్ ప్రీత్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పారు.

స్మృతి మంధాన (80/48)
మహిళల క్రికెట్‌లో 10 వేల పరుగుల రికార్డు

ప్రతిపక్షం www.prathipaksham.in 8 హైదరాబాద్ సోమవారం 29.12.2025

సినిమా

కోచ్ మార్పు వార్తలు ఊహాగానాలే

- క్లారిటీ ఇచ్చిన బీసీసీఐ

భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌ను టెస్టుల్లో తొలగించి ఆ బాధ్యతలను దిగ్గజ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు అప్పగిస్తారని వస్తున్న వార్తలపై బీసీసీఐ స్పందించింది. అవన్నీ ఊహాజనితమని, అసలు అలాంటి చర్చే జరుగలేదని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా తెలిపారు. ఇదే విషయమై ఆయన మాట్లాడుతూ.. 'కోచ్ మార్పుపై వస్తున్న వార్తలు అవాస్తవం. అవన్నీ పూర్తిగా ఊహాజనితమైనవి. కొన్ని ప్రముఖ న్యూస్ ఏజెన్సీలు కూడా ఇలాంటివి ప్రచారం చేయడం సరికాదు. అసలు బోర్డులో అలాంటి (కోచ్ మార్పు) చర్చే జరుగలేదు. కొంతమంది వారికి తోచిన విధంగా ఆలోచించి దానిని నిజమని ప్రచారం చేస్తుంటారు. గంభీర్ కాంట్రాక్టు 2027 ప్రపంచకప్ వరకూ ఉంది. అతడిపై మాకు పూర్తి నమ్మకముంది. మేం ఎవరినీ సంప్రదించలేదు' అని తెలిపాడు.

హంపికి కాంస్యం

భారత వెటరన్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి దోహాలో జరుగుతున్న వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో కాంస్యం సొంతం చేసుకుంది. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ఆమె.. 11 రౌండ్లకు గాను 8.5 పాయింట్లు సాధించింది. అలగ్జాండ్ర (రష్యా), జినర్ (చైనా)తో కలిసి సంయుక్తంగా 8.5 పాయింట్లు సాధించినా టైబ్రేకర్ స్కోరు తక్కువగా ఉండటంతో హంపి మూడో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ టోర్నీలో హంపికి ఇది ఐదో పతకం కావడం విశేషం.



భారత్ తరపున ఆడినందుకు పాక్ కబడ్డీ ప్లేయర్‌పై వేటు

ప్రముఖ పాకిస్థానీ కబడ్డీ ఆటగాడు ఉబైదుల్లా రాజ్‌పుత్‌కు ఆ దేశ కబడ్డీ సమాఖ్య షాకిచ్చింది. కొద్దిరోజుల క్రితం బహ్రెయిన్‌లో జరిగిన ఒక ప్రైవేట్ కబడ్డీ టోర్నమెంట్‌లో ఉబైదుల్లా.. భారత్‌కు చెందిన ఓ జట్టుకు ఆడటమే గాక భారత జాతీయ జెండాను భుజంపై వేసుకున్నాడనే కారణంతో పాకిస్థాన్ కబడ్డీ ఫెడరేషన్ (పీకేఎఫ్) అతడిపై వేటు వేసింది. ఉబైదుల్లా భారత జెర్సీ, జెండా ధరించిన ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవడంతో వివాదం చెలరేగింది. పీకేఎఫ్ నుంచి ఎన్‌వోసీ తీసుకోకపోవడంతో నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను ఉబైదుల్లాపై వేటు పడింది.

'మన శంకర వరప్రసాద్ గారు' పోస్టర్ అదిరింది

సంక్రాంతి రేసులో మెగాస్టార్ చిరంజీవి స్పీడ్ మరింత పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు' పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్లను దూకుడు పెంచింది. తాజాగా మూవీ రిలీజ్‌కి కేవలం 15 రోజుల సమయం మాత్రమే ఉందని తెలియజేస్తూ ప్రత్యేక పోస్టర్ విడుదల చేసింది. ఇందులో చిరు కొబ్బరి బోండం తాగుతూ స్టైలిష్ లుక్‌లో కనిపించారు. ఈ పోస్టర్ మెగా ఫ్యాన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. చిరు ఫ్యాన్స్ ఈ పోస్టర్‌ని సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే అమెరికాలో ఈ సినిమా బుకింగ్స్ అధికారికంగా ఓపెన్ చేసినట్లు మేకర్స్ ఇటీవల ప్రకటించారు. ఈ చిత్రానికి సంబంధించిన యూఎస్ ప్రీమియర్స్ జనవరి 11న అత్యంత గ్రాండ్‌గా నిర్వహించనున్నారు. సంక్రాంతి పండుగకు ముందే బాక్సాఫీస్ బజ్ స్టార్ట్ కావాలనే ఉద్దేశంతో మేకర్స్ ఈ ప్లాన్ చేశారు. పండగ మూడ్‌ను సెట్ చేసేలా ప్రీమియర్స్‌ను డిజైన్ చేయడంతో ఓవర్సీస్‌లో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ సరిగామ సినిమాస్ ఈ చిత్రాన్ని విదేశాల్లో భారీ స్థాయిలో రిలీజ్ చేస్తోంది.. అనిల్ రావిపూడి మార్క్ కామెడీకి చిరంజీవి మాస్ ఇమేజ్, కామెడీ టైమింగ్ కలిస్తే వచ్చే ఎంటర్‌టైన్‌మెంట్‌పై భారీ అంచనాలు ఉన్నాయి.



న్యూఇయర్‌కి 'లెనిన్' అప్‌డేట్

అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'లెనిన్' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'వినరో భాగ్యం విష్ణుకథ' ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్లపై నాగవంశీ, అక్కినేని నాగార్జున సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌తోనే అఖిల్ ఈ సినిమాలో విభిన్నమైన మాస్ పాత్రలో కనిపించబోతున్నాడని క్లారిటీ ఇచ్చారు మేకర్స్. అయితే ఆ తర్వాత సినిమా నుంచి ఎలాంటి అప్డేట్స్ రాకపోవడంతో షూటింగ్ స్టేటస్, రిలీజ్ టైమ్‌లైన్‌పై అభిమానుల్లో సందేహాలు నెలకొన్నాయి. సోషల్ మీడియాలోనూ ఏదొక అప్‌డేట్ ఇవ్వాలని అక్కినేని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా నిర్మాత నాగవంశీ ఓ ఇంటర్వ్యూలో కీలక అప్‌డేట్ ఇచ్చారు. అడగకుండానే మాట్లాడిన ఆయన, మరికొద్ది రోజుల్లోనే 'లెనిన్' ఫస్ట్ సింగిల్ విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం అని తెలిపారు. అంతేకాదు, సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వస్తోందని, వచ్చే ఏడాది మార్చిలో మూవీని విడుదల చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.నాగవంశీ వ్యాఖ్యలతో అక్కినేని అభిమానుల్లో జోష్ పెరిగిపోయింది. నిర్మాత మాటల్ని బట్టి చూస్తే అఖిల్ కెరీర్‌లో ఇదే ఫస్ట్ బ్లాక్‌బస్టర్ అవుతుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. న్యూ ఇయర్ కానుకగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేస్తారని అంచనాలు వినిపిస్తున్నాయి. మరి ఈ రెండు మూడు రోజుల్లో 'లెనిన్'కు సంబంధించిన అధికారిక ప్రకటన వస్తుందా? అఖిల్ నుంచి మాస్ సర్ప్రైజ్ ఎప్పుడు వస్తుందో చూడాలి. కాగా, అఖిల్ కెరియర్‌లో ఇప్పటి వరకు మంచి హిట్ ఒక్కటి లేదు. పెళ్లి తర్వాత అఖిల్ నుండి వస్తున్న తొలి చిత్రం ఇదే కాగా, ఈ మూవీతో మనోడు మంచి హిట్ దక్కించుకుంటాడా, అక్కినేని ఫ్యాన్స్‌కి న్యూ ఇయర్‌లో మంచి ట్రీట్ ఇస్తాడా అనేది చూడాలి.

'సినిమా'కు ఇక సెలవు

దళపతి విజయ్ తన సినీ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. కెరీర్‌లో 69వ చిత్రంగా తెరకెక్కుతున్న 'జన నాయగన్' సినిమానే తన చివరి సినిమా అని విజయ్ ప్రకటించాడు. శనివారం మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన జననాయగన్ సినిమా ఈవెంట్‌లో విజయ్ మాట్లాడుతూ.. సినిమాలకు స్వస్తి చెప్పడం తనకు ఎంతో కష్టంగా ఉన్నప్పటికీ, ప్రజలకు పూర్తిస్థాయిలో సేవ చేయాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎమోషనల్ అయ్యారు. 'నా ఫ్యాన్స్, ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లి నేను నటించిన సినిమాలు చూసేవారు. ఎన్నో ఏళ్లుగా నన్ను సపోర్ట్ చేశారు. నా కెరీర్‌లో ఇంత మద్దతుగా నిలిచిన వారి కోసం నేను 30 ఏళ్లు నిలబడతా. నా అభిమానులకు సేవ చేయడం కోసమే సినిమాలకు గుడ్ బై చెబుతున్నా అని విజయ్ చెప్పుకొచ్చాడు. హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఒక పవర్‌ఫుల్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోంది. రాజకీయాల్లోకి అడుగు పెడుతున్న విజయ్ ఆశయాలకు, ఆయన పార్టీ సిద్ధాంతాలకు అద్దం పట్టేలా ఈ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. విజయ్ ఇప్పటికే 'తమిళగ వెట్రి కళగం' అనే రాజకీయ పార్టీని స్థాపించి, 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు.

హిందీలో 'శంబాల'

ఆదిసాయికుమార్ నటించిన మూవీ శంబాల. యుగంధర్ ముని దర్శకత్వం వహించాడు. అర్చనా అయ్యర్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీ డిసెంబర్ 25న గ్రాండ్‌గా విడుదలైంది. మిస్టికల్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. సస్పెన్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో సాగే ఈ మూవీ ఇక హిందీ మార్కెట్‌లో కూడా తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అవుతోంది. శంబాల ఇక హిందీలో కూడా సందడి చేయనుంది. ఈ చిత్రాన్ని జనవరి 1న హిందీలో కూడా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. మరి మేకర్స్ హిందీ ప్రేక్షకులకు రీచ్ అయ్యేందుకు ఎలాంటి ప్రమోషనల్ స్ట్రాటజీతో ముందుకెళ్లారనేది ఆసక్తికరంగా మారింది. ఇక శంబాల చిత్రాన్ని నార్త్‌ండియా ఆడియెన్స్ ఎలా రిసీవ్ చేసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్, అన్నభీమోజు, మహిధర్ రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మించారు. సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ మూవీలో ఆది జియో సైంటిస్ట్‌గా కనిపించాడు. ఈ మూవీకి శ్రీమ్ మద్దూరి సంగీతం అందించారు. ఈ చిత్రంలో లబ్బర్ పందు ఫేం స్వసిక, రవి వర్మ, మధునందన్, శివ కార్తీక్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. కాగా శంబాల ఓటీటీ పాపులర్ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫాం ఆహా దక్కించుకోగా.. తెలుగు శాటిలైట్ రైట్స్‌ను జీ దక్కించుకుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200